# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293862, 2293206.

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

సంపాదక వర్గము

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి

సి.వి. రమణ బాబు

పి.యస్.ఆర్.కె. ప్రసాద్

కె. మురళీ మోహన వర్మ

సంపుటి 39 సంచిక 11

పేజీలు 44

జులై 2020

5సం॥ల చందా రూ. 250

2సం॥ల చందా రూ. 120

సంవత్సర చందా రూ. 60

విడిప్రతి వెల...... రూ. 5

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్, A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి.

M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా

మేనేజరు

సమర్థ సద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు

గుంటూరు జిల్లా

Printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor PALURI SIVA RAMA KALI PRASAD

ఈ సంచికలో ............................... ....... పేజీ

శ్రీకృష్ణ కర్ణామృతము .......................................4
శ్రీబాబూజీ ఉవాచ....................................... 5
అమ్మమాట............................................... 7
గుర్వష్టకమ్ ...........................................10
శివ విష్ణువులకు అభేదము .......................12
ఏమి నీ కోరిక? ................ .....................15
గుహుడు చేసిన పుణ్యం .... ......................18
ఎవరు గొప్ప? ........................... ..............19
విశ్వాసము ....... ................ ...................21
శార్వరి ................ ........................ ..............25
భగవంతుని సన్నిధినే ఆశించు ................27
ధ్యానం ......................... ....................... ...............29
శ్రీశైల లింగోద్భవ లీల! ................ ....................30
కైవల్యోపనిషత్ ... ..........................................32
శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు............................34
అగస్త్యుడు ................ ......................... .......................35
ఆచార్య మహా ప్రజ్ఞ ................ .................................37
సమర్థ సద్గురునాధుని దివ్యచరిత్ర.....39
విష్ణు కథలు ....... ........................... ...................41

# శ్రీ కృష్ణ కర్ణామృతము

కీ.శే - సుశీలా ప్రసాద

**ప్రథమాశ్వాసము - 91వ శ్లో॥**

**మధురం మధురం వపురస్యవిభో**
**ర్మధురం మధురం వదనం మధురమ్**
**మధుగన్ధి మృదుస్మిత మేతదహొ**
**మధురం మధురం మధురం మధురమ్ ॥**



తాత్పర్యము -

ఈ కృష్ణ దేవుని దేహము మిగుల మధురము. పూతేనె వాసనతో గూడి చక్కని మందహాసము గల మొగమంతకన్న మధురము. చిరునవ్వు అంతకంటె మధురము. అంతా మధురమే.

*రంగనాథ కవి అంధుడెందుకయ్యాడు?
*భాద్రపద మాసంలో నక్షత్ర రూపంలో దర్శనమిచ్చేది ఎవరు?
*నందీశ్వరుని తమ్ముడు ఎవరు?
*ముక్తికి మూలమైన బాట ఏది?
*రాజుగారి చిన్నభార్య ఏం కోరుకుంది?
*మనకు భగవంతుడు ఇచ్చిన గొప్ప వరం ఏమిటి?
*మానవులలో నిక్షిప్తమై వున్న నిగూఢ శక్తులు దేనివలన ప్రకటిత మౌతాయి?
*మనకు సందేహాలెందుకు వస్తాయి?
*భర్త గౌరవాన్ని ఎందుకు కోల్పోతాడు?

***సమాధానాలు లోపలి పేజీలలో.........................***

# శ్రీబాబూజీ ఉవాచ

- కీ.శే. పరాశర ప్రసాద్

17-4-1980

ఈరోజు శ్రీ బాబూజీ దర్శనార్థం ఇరువురు దంపతులు వచ్చారు. భర్త శాస్త్రాలు చదువుకున్నవాడు. వారు మాట్లాడిన తీరునుబట్టి వారిమధ్య అంత సయోధ్య ఉన్నట్లు కనబడదు. శ్రీబాబూజీ వారితో మాట్లాడిన తర్వాత మమ్మల్ని పిలిచారు. శ్రీబాబూజీ మౌనంగా ఉన్నారు. శ్రీ బాబూజీ బోధకోసం మేమంతా వేచి ఉన్నాము.



శ్రీబాబూజీ గంభీరంగా "స్త్రీలకు భర్తయే దైవము. భర్త ఎటువంటివాడైనా, ఎన్ని దుర్వ్యసనాలు ఉన్నా అతనిని భార్య గౌరవించాలి. అయితే శాస్త్రరీత్యా తొమ్మిది తప్పులు చేసిన తర్వాత భర్త ఆ గౌరవానికి అర్హత కోల్పోతాడు. ఆ భర్తను భార్య వదిలివేయవచ్చు.

సాధారణంగా భర్త ఎటువంటివాడైనా భార్య భర్తను ఏదోరకంగా మెప్పించి వశపరచుకుంటుంది. కాని దుర్వ్యసములకు లోనైన భర్త యొక్క మనస్సు, బుద్ధి, స్వతంత్రంగా ఉండక, పరాధీనమై ఉంటుంది. ఆ మనస్సు ఇంద్రియ విషయ వాంఛలకు లోనై ఉంటుంది. మనస్సు, బుద్ధి వక్రత చేత అట్టి వ్యక్తి అనేక నేరాలుచేసి భగవంతుని నిందించటం న్యాయమా?

శాస్త్రవాసన ఉన్న పండితుడు ఈ వక్రబుద్ధిని, లేక సంకల్పాన్ని భగవంతుడే కల్పించాడు, భగవదాజ్ఞ లేనిదే ఎట్టి క్రియకు తావులేదు, అంతా పరమాత్మ లీల! అని లౌకికంగా సమాధానపరచుకుంటాడు. చివరకు ఈ నేరం యొక్క బాధ్యతను భగవంతునికి ఆపాదిస్తాడు.

చూశారా! శాస్త్రవాసన ఎటువంటి పరిస్థితికి దారితీస్తుందో? అటువంటి పండితుల్ని ఏమని పిలవాలో మీరే చెప్పండి" అన్నారు శ్రీ బాబూజీ మమ్మల్ని ఉద్దేశిస్తూ.

'మహా మూర్ఖులు అంటారు' అని మేమంతా అన్నాము.

"మీరు చెప్పింది కరక్టు థ్యాంక్యూ" అన్నారు శ్రీ బాబూజీ.

"అయితే గురులక్ష్యార్థంపై ఎప్పుడూ మనస్సు లగ్నమై ఉన్న వ్యక్తిలో, రజో తమో గుణాలు శివం సుందరంగా మారుతాయి. వారికి ఎల్లప్పుడు ఆనందమేగాని దుఃఖము ఉండదు. మనస్సు పరమాత్ముని ఆధీనంలో ఉన్నప్పుడు తప్పు చేయుటగాని తప్పును గురించి ఆలోచించటంగాని జరుగుతుందా? ఎన్నటికీ జరగదు. కాబట్టి గురులక్ష్యార్థాన్ని ఎట్టి పరిస్థితుల్లోనైనా మరువరాదు. అట్టి వ్యక్తియొక్క మనస్సు నిర్మలంగా, నిశ్చలంగా, నిర్భయంగా ప్రకాశిస్తూ, వక్ర సంకల్పాలకు తావు ఇవ్వదు. కావున అట్టి మనస్సు కలిగిఉన్న భార్యాభర్తల దాంపత్యం ఎంత అన్యోన్యంగా వుంటుందో మీరే ఊహించండి" అని ప్రసంగాన్ని ముగించారు శ్రీ బాబూజీ.

ఇంటర్వ్యూ నిమిత్తం వచ్చిన దంపతులు శ్రీ బాబూజీకి నమస్కారం చేసుకొని సంతృప్తిగా వెళ్ళారు.



# అమ్మమాట - జపమాలా ప్రసాద

## సంకల్ప మాత్ర బంధో బంధః

ఏమీ తెలియకపోయినా కూడా, మానవుడు తనకు అన్నీ తెలుసు అనుకుంటాడు. అదే మాయ! మనకి తెలియదని కూడా మనకు తెలియదు! కానీ, అంతా తెలుసన్నట్టుగా నటిస్తాం. పైగా, 'మనకి తెలుసని' అందరూ తెలుసుకోవటం లేదని కూడా అనుకుంటాం. కానీ, నిజంగా అన్నీ తెలిసినవాడు ఏమీ తెలియనట్టుగానే వుంటాడు. నిండుగా వడ్డించిన విస్తరి అణిగే వుంటుంది. ఖాళీ విస్తరాకు ఎగిరెగిరి పడుతుంది. అన్నీ తెలిసినవాడు, తన్నుతానుగా తెలుసుకున్న వాడు 'ప్రజ్ఞానబ్రహ్మ'యే. ఆయనే జ్ఞాని! వినయ పూర్ణుడు! వారి లీలలు మన ఊహకు కూడా అందవు.



అటువంటి సద్గురు మూర్తిని మనం ఆశ్రయించి వున్నాం. ఇక మనకేమి లోటు? మనకి సందేహాలెందుకు రావాలి? మన గురుమూర్తి సమర్థులై వుండగా, మనకెందుకు సందేహం? మన విశ్వాసం సన్నగిల్లితేనే మనకు సందేహాలు వస్తాయి.

భగవంతుడు మనకు తటిల్లతలాగా అంటే ఒక మెరుపు తీగ లాగా దర్శనమిస్తాడు. మనలో సంకల్పాలు కూడా అలా తటిల్లత లాగానే మెరుస్తాయి! ఎంతో సాధన చేస్తున్నామనే అనుకుంటూ వుంటాం. సడెన్‌గా ఒక తటిల్లతలాగా ఒక సందేహం మెరుస్తుంది! ఎక్కడినుండో కాకి ఒకటి వచ్చి రెట్ట వేస్తుంది. ఆ రెట్టలో మఱ్ఱి బీజాలు వుంటాయి. ఒక బీజం మొలకెత్తి పెద్ద వటవృక్షం అవుతుంది. చివరకు ఆ వృక్షాన్ని నరకాలని, పైపైన కొమ్మల్ని, మోడుని ఎంత నరికినా ప్రయోజనం వుండదు. ఎందుకంటే, దాని వ్రేళ్ళు బాగా లోతుగా చొచ్చుకునిపోయి వున్నాయి కనుక! చివరికి ఆ భవనం కూలిపోవలసినదేగాని, ఆ చెట్టుమటుకు ఊడిరాదు. అలాగే, తటిల్లతలా మెరిసిన ఒక్క సంకల్పం చాలు. అది మనని సర్వనాశనం చేసేవరకూ ఊరుకోదు. శ్రీగురుదేవులు అందుకనే

**'సంకల్పమాత్రో బంధోబంధః'** అని అనేవారు. అదే నిరాలంబోపనిషత్‌లో కూడా **'కేవల మోక్షాపేక్ష సంకల్పో బంధః** అని చెప్పబడింది. అందుకే ఏ ఒక్క సంకల్పం మంచిదైనా, చెడైనా సరే గురుమూర్తి దగ్గర మనసు దాచకుండా వెంటనే ఆయనకు చెబితే, మన మనస్సు క్షాళన అయిపోతుంది.

మనం తరిస్తామా, లేదా అనే సందేహం ఎందుకు? మనం పట్టిన పాదం ఎటువంటిది? ఆయన మనకి ఆ బ్రహ్మానందాన్ని రుచి చూపించారు. - ఇసుక రేణువంత - ఆ ఆనందాన్ని మనం అనుభవించాం. తీర్థం ఒక్క బిందువు తీసుకుంటే చాలన్నారనుకోండి. కానీ, ఒక్క బిందువే తీసుకుంటే ఆ పంచామృతాల రుచి మనకెలా తెలుస్తుంది చెప్పండి? అది పూర్తిగా జుర్రుకోవాలి. ఆ ప్రసాదం బాగా తిన్నాం మనమందరమూ. శ్రీబాబు తమ చేతులతో తినిపించారు మనకి. 'ఆ ప్రసాదం తింటూనే ధ్యానం చేసుకోండి' అన్నారు బాబు. 'ప్రసాదం' అంటే 'గురుమూర్తి అనుగ్రహం'.

**ప్రసాదే సర్వ దుఃఖానాం హానిరస్యోపజాయతే** - అని గీతా వాక్యం. ప్రసాదం సర్వ దుఃఖాలనీ హరించి, పరమ శాంతిని ప్రసాదిస్తుంది. అదే గురువనుగ్రహం.

మనం ధ్యానం చేసుకుంటున్నాం. మనకేయే అనుభవాలు వస్తున్నాయి? మనం ఏ మెట్టు మీద వున్నాం? ఇంకా ఎంత పెరగాలి? ఇటువంటి ప్రశ్నలెందుకు? అలాగని, 'అయ్యో! నేనేమీ చేయటం లేదే! అయ్యో! నేను మూర్ఖుడిని, పాపిని' అని ఇలా కూడా అనుకోనవసరం లేదు. ఉన్నచోటునే ఉందాం! ఆనందం అనుభవిద్దాం! ఏ టైమ్‌కి ఎలా నడిపించుకోవాలో ఆయనకు తెలుసు. కానీ, మనం నడక మొదలు పెట్టాలి. నడక సాగిస్తేనే కదా గమ్యం చేరేది?

**సర్వ ధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ**
**అహం త్వా సర్వ పాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః**

అని అభయం ఇచ్చాడాయన. తను, మనో, ధనాలని గురుమూర్తికి ఇచ్చేశాక, యిక మనదంటూ ఏముంది? మనం చెయ్యాల్సింది 'ఆయన చెప్పింది తు.చ. తప్పకుండా పాటించడం' మాత్రమే.

'గురు నామం చేసుకుంటూ నా వెంటరా నదిని దాట గలుగుతావు' అని, నదిలో మునిగిపోతున్న శిష్యుడికి గురువుగారు చెబితే, వాడు మొదట అలాగే చేసి, సగం దూరం వచ్చాక, సందేహం వచ్చి 'ఈయన కూడా నాలాంటి మనిషే కదా! ఈయన నామం నేనెందుకు చేయాలి?' అని అనుకునేసరికల్లా, నదిలో మునిగి పోయాడు.

కనుక గురుమూర్తి యందు అచంచలమైన విశ్వాసం కలిగి వుండి, గురువాజ్ఞను తు.చ. తప్పకుండా పాటించిన నాడు మనం తప్పకుండా తరించి తీరుతాం. మనలో ఏ గుణాలు, ఏ సంకల్పాలు లేకుండా చేసుకుందాం. అప్పుడటువంటి హృదయ నివాసి అవుతారు మన 'హృదయ బాబు'.

**శ్రీకాళీవనాశ్రమంలో**
**14-8-2020 శుక్రవారం నుండి 23-9-2020**
**బుధవారం వరకు 41రోజులు**
**శ్రీ శ్రీనివాస రామానుజదాస్‌వారిచే**
**శ్రీసంపూర్ణ రామాయణం ప్రవచనం జరుగును**

వర్షం కురిసినందుకు నిదర్శనం నేల మెత్తబడటమే. భక్తి హృదయంలో వున్నందుకు దాఖలా వినయం, సమభావం, సానుభూతి, సేవానిరతి ఇవన్నీ ప్రతి పలుకులో, నడతలో తళుక్కుమనడమే.

- శ్రీ బాబూజీ మహరాజ్

# గుర్వష్టకమ్

(గత సంచిక తరువాయి) - వారణాసి కాళీప్రసాద్ (అమెరికా)

**అరణ్యే నవా స్వస్య గేహే న కార్యే। న దేహే మనో వర్తతే మే త్వనర్ఘ్యే॥**
**గురోరంఘ్రి పద్మే మనశ్చే నలగ్నం। తతఃకిమ్ తతఃకిమ్ తతఃకిమ్ తతఃకిమ్॥**

'నా మనస్సు వనముల యందుగాని, స్వగృహమునందు గాని, కార్యసిద్ధి యందుగాని, దేహ చింతనయందుగాని, లేక విలువైన వస్తువుల యందు గాని నిలువడం లేదు. అయినప్పటికీ ఆ మనస్సును గురు పాదపద్మముల యందు నిలుపలేక పోయినప్పుడు అదంతా నిరర్థకమే' అని ఈ శ్లోకం యొక్క తాత్పర్యము.

మునుపటి ఏడు శ్లోకాలలో వివరించినట్లు భక్తి వైరాగ్యాలను ఆరూఢం చేసుకుని గురుపాదముల కొరకు తపించిన సాధకుడు ధ్యానమునకు ముందు గమనించవలసిన అంశాలను అష్టకములో ఎనిమిదవదైన ఈ శ్లోకంలో శంకరులు అందించారు.

**న దేహే 'మనోవర్తతే' మే త్వనర్ఘ్యే**

**'మనయేవ మనుష్యాణాం కారణం బంధ మోక్షయోః'** అంటూ బంధమోక్షాలు రెండింటికి కేవలం మనస్సే కారణమని తెలవిచ్చిన శంకరులు **'మనో వర్తతే'** అన్న శబ్ద ప్రయోగంతో మరొకసారి మనస్సు తీరుని ఈ శ్లోకంలో గుర్తు చేస్తున్నారు. **'ధ్యానం నిర్విషయం మనః'** అని చెప్పబడింది. అలా ధ్యానమునకు కూర్చోవడానికి ముందు సాధకుడికి కావలసిన సంసిద్ధతను ఈ శ్లోకం తెలియజేస్తోంది. సహజంగా బంధనను కలిగించే విషయాల నుండి మనసు విముక్తి పొందిందనీ, ఇక గురుపాదముల యందు లగ్నమవడానికి సిద్ధంగా వున్నదనీ సూచనగా దీనిని తీసుకొనవచ్చు.

అరణ్యే. న వా స్వస్య గేహే న కార్యే

అరణ్యే న వా స్వస్య గేహే అన్న పదాలలో శంకరులు చాలా విశేషాలు పొందుపరచారనిపిస్తోంది. ధ్యాన ముద్రలో కూర్చున్నప్పుడు సాధకునికి యమ నియమాదులతో పాటుగా వుండవలసినది ఆసన శుద్ధి. ఆసన శుద్ధి కలిగి ధ్యానంలో నిమగ్నమైన సాధకునికి తను వున్న ప్రదేశం యొక్క ఉనికి కూడా గుర్తుకురాదు. అది లోపించినప్పుడు

స్వగృహంలో వున్నా లేక వానప్రస్థం స్వీకరించి వనములకేగినా వ్యర్థమే. నిజమైన సాధకుడికి తన గృహమైనా, అరణ్యమైనా ఒకటేనన్న భావన కలుగుతుంది. మహాత్ములు ఈ విషయాన్ని మాటిమాటికి ఋజువు చేస్తూనే వచ్చారు.

పట్టాభిషిక్తులు అవవలసిన శ్రీరామచంద్ర ప్రభువు అదే చెరుగని చిరునవ్వుతో పితృవాక్య పరిపాలనకై అరణ్యవాసానికి పూనుకున్నారు. సాధకుడికి ఆ సమదృష్టి ఆదర్శం కావాలంటూనే రామావతారంలో శంకరులు మరొకసారి స్తుతించారా అనిపిస్తుంది.

శ్రీసద్గురుదేవులైన బాబూజీ బోధలను అన్వయించి పరిశీలిస్తే - తన స్వస్థానానికి చేరుకోవాలన్న తపన కలిగిన సాధకుడికి బాహ్య ప్రపంచం ఒక అరణ్యం లాగా గోచరిస్తుంది. అలాంటి కారడవిలో పలు రకాల క్రూరజంతువులు దాడిచేయడానికి పొంచి వుంటాయని శెలవిచ్చారు. 'పలురకాల క్రూర జంతువులకు ఆలవాలమైన అరణ్యాన్ని కేవలం ఒక్క నిప్పుకణికతో దహించవచ్చు. అది ధ్యావము వలన మాత్రమే సాధ్యము' అంటూ **'ధ్యానాగ్ని దగ్ధ కర్మాణి'** అని శ్రీబాబూజీ బోధించారు.

అలాంటి ధ్యానమునకు ఉపక్రమించిన సాధకుడి మనసు ఇతరత్రా ఏ విషయాదులకుగానీ, భ్రాంతులకుగానీ లోనుకాకుండా గురుపాదపద్మములయందు మాత్రమే ఏకాగ్రత చెందాలన్నది ఈ శ్లోకము యొక్క నిగూఢమైన సారాంశము.

-సశేషం

### *పెదనింద్రకొలను శాఖలో కార్యక్రమాలు*

**జులై 2020**

1 బుధ - తొలిఏకాదశి - శ్రీసద్గురుపాదపూజ

5 ఆది - ఆషాఢ పౌర్ణమి (గురు పౌర్ణమి) - శ్రీసద్గురుపాదపూజ

15 బుధ - శ్రీగురుదశమి - శ్రీసద్గురుపాదపూజ.

**ఆగస్ట్ 2020**

3 సోమ - రాఖీ - జంధ్యాల పౌర్ణమి - శ్రీసద్గురు పాదపూజ

11 మంగళ - శ్రీకృష్ణాష్టమి - శ్రీసద్గురుపాదపూజ.

13 గురు - శ్రీగురుదశమి - శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన.

22 శని - వినాయక చవితి - శ్రీసద్గురుపాదపూజ

# శివ విష్ణువులకు అభేదము

-కీ.శే. సుశీలా ప్రసాద

'విష్ణువు ఘనుడా? శివుడు ఘనుడా?' అని చక్రపాణి రంగనాధ కవికి, పాల్కురికి సోమనాధ కవికి వరంగల్ పట్టణంలో, వెయ్యి స్థంబాల మండపంలో 15రోజులుగా అఖండ చర్చ జరుగుతోంది. చివరికి సోమనాధుడే జయపతాకాన్ని ఎగురవేశాడు. రంగనాధుడి శిరస్సు వాలిపోయింది. శివుడే ఘనుడు అన్నారంతా!

పరాభవ భారంతో రంగనాధుడు శిష్యులు వెంటరాగా మేనా మీద తన అభిమాన క్షేత్రమైన ఆహోబిల క్షేత్రానికి బయలుదేరాడు. రంగనాధునిలో ఈ ఓటమితో శివద్వేషం మరింతగా పెరిగింది. పగతో బుసలు కొడుతున్నాడు. మజిలీల మీద యాత్ర సాగుతోంది.

ఒకరోజు రంగనాధుడు 'ఇప్పుడెక్కడ వున్నాం?' అని ప్రశ్నించాడు. 'గురుదేవా! శ్రీశైల మహా క్షేత్రంలో వున్నాము. ఉదయ సూర్య కాంతులలో శిఖరేశ్వరం ధగద్ధగలాడుతోంది' అని బదులిచ్చారు శిష్యులు.

చరాలున మేనా తలుపులు, రంగనాధుని కనురెప్పలు ఒకేసారి మూసుకున్నాయి. ఏమరుపాటున ఎక్కడ గిరి దర్శనమవుతుందో అని రంగనాధుడు కళ్ళకు గంతలు కూడా కట్టుకున్నాడు. మేనాను అహోబిల క్షేత్రంలో దింపారు. రంగనాధుడు మెల్లగా మేనాదిగి బయటకు వచ్చాడు. ఆశ్చర్యం! ఆయనకు సర్వం చీకటైపోయింది. తొట్రుపాటుతో కనులు పదేపదే నులుపుకుని మరీ చూశాడు. చీకటి తప్ప ఏమీ కనబడటం లేదు. అతని నేత్ర దృష్టి పూర్తిగా పోయింది.

రంగనాధుని గుండె బ్రద్దలైంది. శోకజలధిలో మునిగిపోయాడు. ఆ జలధి మధ్య నుండి శ్రీమన్నారాయణుని మీద భక్తిజల వువ్వెత్తుగా లేచింది. అశ్రుధారలతో, ఆశుధారగా ఆ పురుషోత్తముణ్ణి స్తుతిస్తున్నాడు..........

'హే ప్రభో! నీ చరణదాసుణ్ణి. నిన్ను తప్ప మరొకదైవాన్ని ఎన్నడూ కొలవలేదే! నీవే నాకు దిక్కని శరణు పొందానే! ఏ పాపానికి ఈ కఠిన శిక్ష? కళ్ళు లేకపోతే ప్రపంచమే లేదే! నేనెట్లా బ్రతకను? ఏ ఆశతో బ్రతకను? నీతో తప్ప ఎవరితో మొర పెట్టుకోను స్వామీ! స్వామీ! ......... ....... కరివరదా! పార్థ సారథీ! గోకుల చక్రవర్తీ! నిన్ను స్మరించడం తప్ప నేను చేయగలిగిందేమీ లేదు' అంటూ కూలబడిపోయాడు.

రంగనాధుని ఆర్తికి ప్రకృతీ, నరసింహస్వామి ధరించిన ఆభరణాల్లోని వజ్రవైఢూర్యాలు కరిగి నీరై, ఏరై ప్రవహించాయి. ఇక ఆ భక్తవరదుని మనస్సు కరిగిందని వేరే చెప్పాలా!

ఓ గంభీరమైన వాణి వినిపించింది ...... 'రంగనాధా! పరమ రహస్యం చెబుతున్నాను విను. .... మహాదేవుడికి నాకు అభేదము. ఒకే పరమ తత్వం త్రిమూర్తులుగా, దేవతలుగా, పద్నాలుగు భువనాలుగా అభివ్యక్తమవుతోంది. ఈ భేదాలన్నీ బాహ్య దృష్టికే. పరమార్థంలో భేదం లేదు. ఈశ్వరుడూ, నేనూ మూలంలో ఒక్కటే. భేదదృష్టి వల్ల నువ్వు పరమేశ్వరుణ్ణి ద్వేషించావు. భయపడకు. ఏ మల్లికార్జునస్వామిని చూడటానికి నీవు కన్నులు మూసుకున్నావో ఆ శ్రీగిరికి వెళ్ళి, ఆ దేవదేవుని ప్రార్థించు. ఆ భోలా శంకరుడు కరుణామయుడు! నిన్ను కరుణిస్తాడు. నీకు తిరిగి దృష్టి వస్తుంది సుమా!' అని వినబడింది.

రంగనాధుని మనస్సు శాంతించింది. వున్నపాటున ఆయన శ్రీశైలానికి ప్రయాణమై వెళ్ళాడు. త్రిభువన మోహనము, పరమపావనము, భూకైలాసము అయిన ఆ శ్రీశైల మహాక్షేత్రానికి వచ్చాడు. తూర్పుద్వారం ముందు నిలబడి భక్తితో జ్వలిస్తూ, పులకిస్తూ అనేకవిధాలుగా ఆ సకలేశ్వరుణ్ణి స్తుతిస్తున్నాడు.

'త్రినేత్రా! ఫాలలోచనా! తెలియక చేసిన ఈ తప్పుకు, అన్నీతెలిసిన నీవు ఇంత దారుణ శిక్ష విధించడం న్యాయమా? నీ బిడ్డను తండ్రీ! నా అవివేకపు చేష్టలకు నీవు కినుక వహిస్తావా? నాకు సత్యం అవగతమైనది. నీకు విష్ణువుకు అభేదమని సాక్షాత్తు విష్ణువే నాకు తెలియజేశాడు. తండ్రీ! కరుణామూర్తీ! నాకు నేత్రదానం చెయ్యి నీకు రెండు కళ్ళు చాలక, మూడు కళ్ళు పెట్టుకున్నావే! నాకు నీవు ప్రసాదించిన రెండు కళ్లను నీవే చిదిపి వేస్తావా? ప్రభూ! కరుణించు! రక్షించు! ....' అంటూ ప్రార్థించాడు.

నిటలేక్షణుడు కరుణేక్షణుడయ్యాడు. రంగనాధునికి చూపు వచ్చింది. రంగనాధుడు పరిసరమంతా ఆనందంగా చూశాడు. కానీ ఒక్క కంటికే చూపు వచ్చింది. రంగనాధుడు రావిటాకులా అల్లల్లాడిపోతూ తిరిగి 'మహేశ్వరా! నీ పరిపూర్ణ కరుణాకటాక్షానికి నేను నోచుకోలేదా? ఒకవేళ నా భక్తికి లోపం వుండవచ్చు, కానీ అక్షయమ్మైన నీ కరుణకు లోపం వుండకూడదు. ఏ నీ ఆది అంతములులేని స్వరూపాన్ని చూడటానికి బ్రహ్మవిష్ణులు ప్రయత్నించి విఫలులైపోయారో, ఆ ఊహకు

అందని అద్భుతమైన స్వరూపాన్ని, పరిమితమైన లింగరూపంగా దర్శనమిస్తూ భక్తులను కరుణిస్తున్నావు కదా! నేత్ర కళ్యాణంగా రెండు కళ్ళతో మనసారా నీ మూర్తిని చూసేటట్లు అనుగ్రహించు స్వామీ!' అని పరిపరి విధాలుగా ప్రార్థించాడు.

ఆకాశంలో ఒక మెరుపు మెరిసింది. ఒక వాణి వినబడింది. 'రంగనాథా! భయపడకు నేనున్నాను. నీవు వెంటనే నా భక్తాగ్రేసరుడైన పాల్కురికి సోమనాథుని దగ్గరకు వెళ్ళు. అతను నీకు రెండో కంటికి చూపును ప్రసాదిస్తాడు. భగవంతుడికి భక్తుడికి అభేదము' అని.

రంగనాథుడు వరంగల్లు ప్రయాణమయ్యాడు. సోమనాథుడే పరుగు పరుగున ఎదురు వచ్చి, గాఢాలింగనము చేసుకుని, అతిథి మర్యాదలన్నీ జరిపాడు. 'ఏమిటి మీరు వచ్చిన కారణం?' అని అడిగాడు. రంగనాథుడు జరిగినదంతా పూస గుచ్చినట్లు చెప్పాడు.

సోమనాథుడు కొన్ని క్షణాలు ఆనంద సమాధిలో మునిగిపోయాడు. ఆ తరువాత భక్తితో పులకరించిపోతూ మధురవాక్కులతో 'నా తండ్రి జగదీశ్వరుడు నా హృదయేశ్వరుడు నా పేరు పలికాడా!' అంటూ, పాలు పొంగినట్లు పొంగిపోతూ... 'ఓహో! నా వ్రతం ధన్యమైనది! పూర్వ జన్మ పుణ్యం ఫలించింది! కళానిధి శేఖరుడు కరుణామృతాన్ని గుమ్మరించాడు.

దేవతలు, ఋషులు, యోగులు, భక్తులు ఎవరి నామాన్ని స్మరించినంత మాత్రంచేత ధన్యులైపోతున్నారో, ఆ సకలేశ్వరుడు, భక్తవత్సలుడు దాసదాసుడనైన నా పేరును ఉచ్ఛరించాడు. ఓహో! దేవతలంతా దీవించవలసిన సుముహూర్తమిది!

పరమేశ్వరుడు నా ద్వారా నీకు రెండో కన్ను ప్రసాదించాలని ముచ్చటపడుతున్నాడు కాబోలు! అంతకంటే కోరదగిన గౌరవం ఏమున్నది? రంగనాథా! ఈ కరుణ నీవల్ల నాకు లభ్యమైనది. నీ ఋణం నేను తీర్చుకోలేను' అంటూ విభూతిని రెండోకంటికి రాశాడు.

రంగనాథుని నేత్ర పద్మం వికసించింది. రంగనాథుని, సోమనాథుని హృదయ పద్మాలు ఏకకాలంలో వికసించాయి! శ్రీమల్లికార్జున ప్రసన్న! పాహిమాం! పాహిమాం!!

# ఏమి నీ కోరిక?

సేకరణ - వంకిన సాయికృష్ణ

ఒక పేదవాడు సంతలో తిరుగుతున్నాడు. వాడికి చాలా ఆకలిగా వుంది. వాడి దగ్గర వున్నది ఒక్క రూపాయి మాత్రమే. దానితో తన ఆకలి ఎలా తీర్చుకోవడం? అని ఆలోచిస్తూ, సంతలో ఆ చివరి నుండి ఈ చివరి దాకా తిరిగాడు. ఒక చోట కొట్లో ఒక ఇత్తడి దీపం కనిపించింది. దాని క్రింద 'ఒక్క రూపాయి మాత్రమే!' అని రాసి వుంది. ఆ పేదవాడు అంతపెద్ద దీపం ఏమిటి? ఒక్క రూపాయి ఏమిటి? అని ఆశ్చర్యపోయి దాని దగ్గరకు వెళ్ళి చూశాడు.

అది అల్లా ఉద్దీన్ దీపంలా వుంది! సుమారు ఒక కిలో బరువు వుంటుంది! అయినా ఒక్క రూపాయేనా? అది కొని, అమ్మేసుకుంటే తనకు ఎక్కువ డబ్బులు వస్తాయి కదా అని అతని ఆలోచన!

అతను ఆ షాపు వాడి దగ్గరకు వెళ్ళి 'అంత పెద్ద దీపం, అంత తక్కువ ధరకు ఎందుకు అమ్ముతున్నావు?' అని అడిగాడు. ఆ యజమాని 'బాబూ! ఇది ఒక అద్భుత దీపం. ఇందులో ఒక భూతం వుంది. అది నువ్వు కోరుకున్న కోరికలన్నీ తీరుస్తుంది. అయితే ఈ భూతానికి ఒక లక్షణం వుంది. అది ఎప్పుడూ చురుకుగా వుంటుంది. దానికి ఎప్పుడూ ఏదో ఒక పని చెబుతూ వుండాలి. లేదంటే, అది తాను ఇచ్చిన బహుమతులు అన్నీ తీసుకుని వెళ్ళిపోతుంది. అదీ దాని కథ' అని చెప్పాడు.

పేదవాడు ఆ దీపాన్ని ఒక రూపాయి ఇచ్చి కొనుక్కున్నాడు. ఇంటికి తీసుకువెళ్ళి దాన్ని రుద్దాడు. భూతం ప్రత్యక్షం అయింది. 'ఏమిటి నీ కోరిక?' అని అడిగింది.

తనకు ఆకలి వేస్తోంది కనుక భోజనం ఏర్పాటు చేయమన్నాడు. క్షణాలలో పంచ భక్ష్య పరమాన్నాలతో భోజనం సిద్ధం! భోజనం కాగానే..... 'ఏమిటి నీ కోరిక?' అని అడిగింది. 'పడుకోవడానికి మంచం కావా'లన్నాడు. వెంటనే హంసతూలికా తల్పం వచ్చేసింది. వెంటనే మంచి నిద్ర కూడా పట్టేసింది. మంచి నిద్రలో వుండగా.... 'ఏమిటి నీ కోరిక?' అని అడిగింది. 'ఒక మంచి ఇల్లు కావా'లన్నాడు. వెంటనే రాజభవనంలాంటి పెద్ద ఇల్లు వచ్చేసింది. వెంటనే...... 'ఏమిటి నీ కోరిక?' అన్నది. పేదవాడు ఇప్పుడు గొప్ప ధనవంతుడు అయ్యాడు. అలా

అడుగుతూనే వున్నాడు. కోరికలు తీరుతూనే వున్నాయి. ఇహ అతనికి విసుగు వస్తోంది. ఎన్నని అడుగగలడు? అడగకపోతే ఈ భూతం ఇప్పటిదాకా ఇచ్చినవన్నీ తీసుకుని వెళ్ళిపోతుంది! ఎలా???

ఆ పేదవాడు తన గ్రామంలో వున్న ఒక వృద్ధ సన్యాసి దగ్గరకు వెళ్ళాడు. ఆయనతో తన సమస్యను చెప్పుకున్నాడు. తిరిగి ఇంటికి వచ్చేసరికి భూతం 'ఏమిటి నీ కోరిక?' అని అడిగింది.

భూమిలో పెద్ద గొయ్యి తియ్యమన్నాడు. క్షణాలలో తీసింది. దానిలో ఒక పెద్ద స్థంభం పాతమన్నాడు. పాతేసి, 'ఏమిటి నీ కోరిక?' అన్నది. 'నేను తిరిగి నీకు నా కోరిక చెప్పేవరకూ నువ్వు ఈ స్తంభం ఎక్కి దిగుతూ వుండు' అన్నాడు. ఆ భూతం అలా ఎక్కి దిగుతూనే వుంది.

అతను తన ఇంటికి వెళ్ళి తాను చేయవలసిన పనులు ఏమిటో చెయ్యడం మొదలు పెట్టాడు. తన చుట్టూ వున్నవారికి తాను చేయగలిగిన సహాయాలు చేశాడు. తన సౌఖ్యం, తన చుట్టూ వున్న వారి సౌఖ్యం చూస్తూ జీవితం గడపటం మొదలు పెట్టాడు.

కొన్ని రోజుల తరువాత ఆ భూతం ఏం చేస్తోందో అని చూడాలని వెళ్ళాడు. అది ఆ స్థంభం దగ్గర నిద్రపోతోంది!!

ఈ విజయానికి తనకు మార్గం చూపిన ఆ సన్యాసి దగ్గరకు వెళ్ళి కృతజ్ఞతలు తెలిపాడు.

ఇక్కడితో కథ పూర్తి కాలేదు. ఈ కథ మనందరిదీ. ఈ కథ నుండి మనం ఏమి నేర్చుకోవాలి? మన మనస్సే ఆ భూతం. అది ఎప్పుడూ చాలా చురుగ్గా వుంటుంది. విశ్రాంతి లేకుండా కోరికలు కోరుతూనే వుంటుంది. ఎప్పుడూ అలసట లేకుండా అడుగుతూ వుండటమే దాని పని. ఆ కథలో సన్యాసి చెప్పిన మాట ప్రకారం భూతం నాటిన స్థంభమే మంత్రం. ఎక్కడం దిగడమే ఆ మంత్ర జప సాధన. అను నిత్యం మంత్ర జప సాధన చెయ్యడం ద్వారా విశ్రాంతి లేని మనస్సు విశ్రాంతి స్థితిలోకి వెళ్ళడం సాధ్యమవుతుంది. అప్పుడు మనస్సు ధ్యాన స్థితిలోకి వెడితే మన ఆత్మ మేల్కొంటుంది. అంతరాత్మ ఈ ప్రపంచాన్ని ఆనందించడం మొదలు పెట్టి, మనం ఇతరుల గురించి ఆలోచించడం మొదలుపెడతాము. ఆత్మ ప్రబోధానుసారం ప్రవర్తించడం మొదలు పెడతాం. ఇతరుల సౌఖ్యం కోసం తగిన చర్యలు తీసుకుంటాం.

మనం అంటే మనస్సు మాత్రమే కాదు. అంతకన్నా ఎక్కువే. మనం అవినాశి అయిన ఆత్మలం. మన మనస్సు అవిశ్రాంత స్థితిలో వున్నంత వరకూ మనం మన ఆత్మ దర్శనం చెయ్యలేము. చేయనీయదు. మనసుకు విశ్రాంతిని ఇచ్చినప్పుడే మన ఆత్మ మనకు గోచరం అవుతుంది. అప్పుడే మనం ఇహపరలోకాల ఆనందాలను అనుభవించ గలం.

మన మనస్సు మనకు ఆలోచననూ, విచక్షణనూ, కోరికలనూ, అవగాహననూ, విమర్శనాత్మక దృష్టినీ, న్యాయాన్యాయ నిర్ణయాలను తీసుకునే శక్తి వంటి ఎన్నో బహుమతులను ఇచ్చింది. అందువలన మనం ఈ భౌతిక ప్రపంచంలోనే జీవితం సాగిస్తూ దైవీ స్థితికి చేరుకోగలం!

మన మనస్సు మనకు భగవంతుడిచ్చిన గొప్ప వరం. ఆయన తన మనస్సును ఉపయోగించి, ఈ సృష్టిని సృష్టించాడు. మన మనసుకు సరిగా శిక్షణనిచ్చి ఉపయోగించుకుంటే అది మనం కోరుకున్న జీవితాన్ని సాధించేలా చేస్తుంది.

ధ్యానము, మంత్రజపమూ చేస్తే అది మనలను ఆత్మ దర్శనం చేయగలిగే స్థితికి చేరుస్తుంది. దాన్ని నియంత్రణలో వుంచుకోకపోతే అది మనలను నాశనం చేయగలదు. ఒకేసారి అనేక విషయాలను ఆలోచించ గలదు. ఒకే ఒక్క విషయం పైన కూడా దృష్టి పెట్టగలదు.

మనసుకు శిక్షణ ఇవ్వడం ద్వారా మనం ఎన్నో విజయాలను సాధించగలం. జీవిత లక్ష్యాలను సాధించగలం. దాని మానాన దాన్ని వదిలేస్తే శిక్షణ లేని ఆ మనస్సు మన వినాశనానికి హేతువులైన దురాశ, పగ, ప్రతీకారం, కామం, క్రోధం, గర్వం, అహంభావం... ఇలా ఒకటా రెండా!! ఇలాంటి అనేకానేక అధమ స్థాయి కోరికలకు బానిసలం అయ్యేలాగా చేస్తుంది.

మన మనస్సులో కదిలే ఆలోచనలు మన సమయాన్ని, మన దృష్టినీ కోరుతాయి! అవి మన ప్రవర్తనని నిర్ణయిస్తాయి! ఇక ఆ నిర్ణయం మనదే సుమా!

# గుహుడు చేసిన పుణ్యం

- పాలూరి ప్రసాద్

గుహుడు పూర్వజన్మలో ఒక వేటగాడు. ఒకనాడు అడవిలో వేటాడుతూ వుండగా అతనిని ఒక పులి వెంబడించింది. అతను భయంతో దగ్గరలో వున్న చెట్టెక్కాడు. ఇంతలో చీకటి పడింది. ఆ చీకట్లో ఇంటికెళ్ళే దారిలేక ఆ రాత్రికి ఆ చెట్టుమీదే వుండాలని నిర్ణయించుకున్నాడు. అయితే ఆ నిద్రలో ఎక్కడ జారిపడతానో అని భయంతో, నిద్ర ఆపుకోవడం కోసం రాత్రంతా ఆ చెట్టు ఆకులు వలిచి క్రింద వేయడం మొదలు పెట్టాడు. ఏ జన్మ భాగ్యమో అప్పుడు మూడు అద్భుతమైన విషయాలు జరిగాయి.

ఒకటి ఆ రోజు శివరాత్రి కావడం. రెండు అతనెక్కిన చెట్టు మారేడు చెట్టు కావడం, మూడు ఆ చెట్టు క్రిందే ఒక శివలింగం వుండటం. తనకు తెలియకుండానే శివరాత్రి నాడు జాగారం చేస్తూ, రాత్రంతా పరమేశ్వరునికి బిల్వదళాలతో పూజ చేయడం వల్ల అతను తరువాత జన్మలో గుహుడుగా జన్మించి, రామతత్త్వాన్ని పూర్తిగా ఎరిగి మరీ రాముని పాదాలను కడిగి, ఆ పాదతీర్థం స్వీకరించి, సీతారామ లక్ష్మణులను గంగను దాటించి, అందుకు ప్రతిఫలంగా తాను భవసాగరాన్ని దాటే వరాన్ని పొంది తరించాడు.

## సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా జులై, ఆగష్ట్ 2020 మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

***జులై 2020:*** AS 3728, 6374,6405, 6409, 6716, 6887, 7467, 7953, 7954, AS 7955, 8146, 8147, 8148, 8151, 8152, 8157.

***ఆగష్ట్ 2020:*** AS 7141, 7143, 7797, 8160, 8166 to 8185, 8187 to 8189, AS 8191 to 8209, 8212, 8213, 8216, 8217, 8219 to 8228, AS 8231 to 8238, 8240 to 8249, 8251 to 8260, 8262 to 8264, 8267 to 8275, 8281 to 8284, 8287 to 8289, 8343, AS 8346, 8360 to 8366.

(గత సంచిక తరువాయి) 

# ఎవరు గొప్ప ? 

- సుషుమ్నా ప్రసాద

ఇప్పుడు మనస్సు తన వంతు వచ్చిందనుకుని ఉబలాట పడింది. మిగిలిన అవయవాల పరాజయంతో తాను రాజీపడలేదు. అన్ని ఇంద్రియాలలోకి మనస్సు ప్రధానం కాబట్టి, తాను లేకపోతే శరీరం తప్పక నిర్వీర్యం అవుతుంది అని భావించి, అహంకారంతో విర్ర వీగుతూ, శరీరాన్ని విడిచిపెట్టి సంవత్సర కాలంపాటు విహారయాత్ర ప్రారంభించింది. మనోవేగానికి మించిన వేగం లేదు కాబట్టి ముల్లోకాలలో వున్న సౌందర్యాన్ని దర్శించుకుంటూ పులకిస్తూ, మానవునికి మనస్సుకు మించినది లేదని భావించి తన ప్రతిభకు తానే విర్రవీగింది. తాను లేకపోతే మనషికి మనుగడే లేదని భావిస్తూ, తన స్వస్థానమును చేరుకున్నది మనస్సు. కానీ చిత్రమేమంటే శరీరం తన తేజస్సుని కోల్పోలేదు. మానవుడు విచక్షణా రహితంగా ఏది లభిస్తే అది తింటూ మంచి. చెడు ప్రసక్తే లేకుండా జీవితాన్ని గడుపుతున్నాడు. ఈ దృశ్యాన్ని తిలకించిన మనస్సు తన ప్రతిభ కాదిది భగవన్నిర్ణయమే అని గ్రహించి, మౌనంగా తన స్థానాన్ని తాను ప్రవేశించిది.

ఆఖరుకు ప్రాణం తన వంతు వచ్చిందని ఆ శరీరం నుండి నిష్క్రమించింది. మిగిలిన ఇంద్రియాలన్నీ తమ పరాజయం చూసినా కూడా ప్రాణం ఇలా చేస్తుందేమిటని పరిహసించాయి. కానీ వారి అంచనాలు తల క్రిందులు అయ్యాయి. ప్రాణం నిష్క్రమించగానే శరీరం నిర్వీర్యమై, తేజోహీనమైపోయింది. కనులు చూడలేక పోయినవి. వీనులు వినలేక పోయాయి. వాక్కు మాట్లాడలేకపోయింది. మనస్సు తన గారడీతో శరీరాన్ని చలింపజేయ లేక పోయింది.

అప్పుడు ఇంద్రియాలన్నీ కూడా తమ ప్రతిభ ఏమీ లేదని, అంతా భగవదాదేశానుసారమే జరుగవలసినదే కానీ, భగవంతుడు తమకు ప్రసాదించిన ప్రతిభకు విర్రవీగకూడదని పూర్తిగా గ్రహించాయి. సృష్టి కర్త అయిన ఆ పరమేశ్వరుడి ఆజ్ఞ ప్రకారం ఎవరి కర్తవ్యాన్ని వారు నిర్వహించి, అహంకారాన్ని అణచివేసినప్పుడే జీవితం సాఫల్యం అవుతుందని గ్రహించాయి.

అహంకారమును దరిచేరనీయకుండా దానికి తిలోదకాలిచ్చి, మానవులంతా సంఘీభావనతో, సఖ్యతగా వర్తించినప్పుడే దేశాభ్యుదయమునకు జగద భువన విజయానికి దోహదం చేయగలదు. ఛాందోగ్యోపనిషత్ లోని ఈ కథ సాధకునకు అహంకారం ఎంత ప్రబల శత్రువో తెలియజేస్తోంది. గొప్పతనమనేది భగవత్ప్రసాదిత మైనదని వినయంతో స్వీకరించాలిగాని, గొప్పతనం తన ప్రతిభేనని విర్రవీగేవానికి పతనం తప్పదని ఈ ఉపనిషత్తు ద్వారా గ్రహించాలి. గొప్ప, హీనం ప్రమేయం లేకుండా సమానత్వంతో సమత మమతలను పెంచుకోవాలి.

**భక్తులకు విన్నపము**

శ్రీ సద్గురునాధుని దివ్య చరిత్ర ఇప్పటికి 2 భాగములు -1వ భాగం 2005లోను, 2వ భాగం 2011లోను వెలువడినవి. వీటిని శ్రీ విజయేశ్వరానంద ప్రసాద్ వారు గ్రంథస్థం చేశారు. ఇప్పుడు మనం 2020 సంవత్సరంలో ఉన్నాం. గడచిన ఈ 16 ఏళ్ళకాలంలో శ్రీగురుదేవులు, గురుస్థానంలో విరాజిల్లుతున్న "అమ్మ" తమ కృపా కటాక్షాలను మనందరిపై వెదజల్లి మనలను సంరక్షిస్తున్నారు. బాబూజీ అవతార సమయంలో, అమ్మ రక్షణలో భక్తులు పొందిన దివ్యానుభవాలను ఆధ్యాత్మికతతో జోడించి పోస్ట్‌లోగాని, email లోగాని, ramuchitti@yahoo.com/ cvrbabu41@gmail.com కి ముందుగా పంపండి. ఆ తరువాత మాకు వాటి పూర్తి వివరణను ఇస్తే, ప్రచురణార్హమైనవి, అమ్మ అనుజ్ఞతో "శ్రీ సద్గురునాధుని దివ్య చరిత్ర" (3వ భాగం) గా ప్రచురణ చేయటం జరుగుతుంది. కావున భక్తులు గమనించి అమ్మ తలపెట్టిన "గురుకార్యా"న్ని విజయవంతం చేయమని ప్రార్థిస్తున్నాము.


విశ్వాసం
మధుప
ఎప్పటికైనా గురుదేవులు అనుభవిస్తున్న ఉన్నత స్థితిని మీరూ అనుభవించాలంటే ఆయన వాక్కు పై మీకు అచంచలమైన విశ్వాసం ఉండాలి.
1
గురుదేవా! ఇక్కడ పడవ కూడా లేదు. ఇప్పుడే నదిని ఎలా దాటాలి?
2


గురునామం స్మరించుకుంటూ నా వెనుకే రండి నాయనా!
3


ఓం గురుదేవాయ నమః
4


ఈయన కూడా నాలాగే
రెండు చేతులు, రెండు
కాళ్ళతో ఉన్నారు కదా!
ఆయన నామాన్ని
తలిస్తే నేను
తేలడమేమిటి?
5


గురుదేవా
మునిగిపోతున్నాను,
కాపాడండి!
సంపూర్ణ
విశ్వాసంతో
గురునామాన్ని
జపించు నాయనా!
6


హమ్మయ్య! మళ్ళీ తేలాను. అయినా నాలాగే ఉన్న ఈయన నామానికి ఇంత శక్తి ఎక్కడనుంచి వచ్చింది? నాకింకా నమ్మబుద్ధి కావట్లేదు.
7


నీ విశ్వాసమే నిన్ను రక్షిస్తుంది నాయనా! విశ్వాసం లోపిస్తే అదే నీ పతనానికి దారితీస్తుంది.
గురుదేవా మళ్ళీ మునిగిపోతున్నాను. కాపాడండి!
8

(గత సంచిక తరువాయి)

# శార్వరి

-పాలూరి కాళీప్రసాద్

తల్లివద్ద పిల్లలలాగా వారందరూ శిరోజాలు కనిపించేలాగా వృత్త శిరస్సులతో ముందుగా నమస్కరించిన తరువాత వారి భర్తలు తమతమ ఆధిపత్యాలను, అధికారాలను ఆ తల్లి పాదాల వద్ద అర్పిస్తున్నారా! అన్నట్లుగా కిరీటాలతో సహా ఎలా నమస్కరిస్తున్నారో చూడండి. **దేవదేవేశ దైత్యేశ యక్షేశ భూతేశ వాగీశ కోణేశ వాయ్వగ్ని కోటీర మాణిక్య సంఘృష్ట బాలా తపోద్దామ లాక్షారసారుణ్య లక్ష్మీ గృహీతాంఘ్రి పద్మద్వయే** - దేవతలు, దేవేంద్రుడు, రాక్షస ముఖ్యులు, యక్ష, భూత, గణాధిపతులు, బ్రహ్మదేవుడు, దిక్పాలురు, వాయువు, అగ్ని మొదలైన దేవతలందరూ తమతమ కిరీటాలను ఆ తల్లి పాదాలకు తాకించి నమస్కరిస్తూవుంటే ఆ కిరీటాలలో వున్న దివ్య మణిమాణిక్యాల కాంతులతో అరుణిమను సంతరించుకున్న జగన్మాత పాదాలు ఎఱ్ఱటి పద్మద్వయంలాగా ప్రకాశిస్తున్నాయట.

మరి అంతటి తల్లిని ఆశ్రయించిన మనకు ఈ ప్రాపంచిక విషయాల వలన భయమేమున్నది? కాదు, మాకు ప్రాపంచిక సౌఖ్యాలే కావాలి అంటారా? అవి అందివ్వడానికి ఆ బోళా శంకరుడు ఎప్పుడూ సిద్ధంగానే వుంటాడు. భగవంతుడిని ఆరాధించేవారు నాలుగు రకాలని **చతుర్విధా భజంతే మాం జనాః సుకృతినోర్జున ఆర్తో జిజ్ఞాసురర్థార్థీ జ్ఞానీచ భరతర్షభ!** - అని గీతాచార్యుడు చెప్పాడు. ఇందులో మొదటి రెండు రకాల వారికి ప్రతి పదానికి **'నమో నమో'** ... అంటూ సాగే రుద్ర నమకమ్ సమాధానం చెబుతుంది. తన కష్టాలను తొలగించమని ఆర్తితో దరిచేరినవానికి ఆ ప్రభువు మహాత్మ్యం ఎంతటిదో, ఆయన తన ఆర్తిని ఎంత తేలికగా పోగట్టగల శక్తిమంతుడో ఈ నమకం చూపెడుతుంది. అలాగే భగవంతుని దివ్య వైభవాన్ని తెలుసుకోవాలని వచ్చిన జిజ్ఞాసువుకు కూడా ఈ నమకం సమాధానాన్ని ప్రసాదిస్తుంది.

ఇక ప్రతి పదానికి **'చ మే'** అంటూ సాగే చమకం మిగిలిన రెండు రకాలవారికి సమాధానం చెబుతుంది. ఈ లోకంలోని రకరకాల సంపదలన్నీ నాకే కావాలని కోరుకునే అర్థార్థికి ఆయా సంపదలన్నీ స్వామిని ఆశ్రయిస్తే తప్పక లభిస్తాయని ఈ చమకం చూపెడుతుంది.

అయితే 'మే' అనే షష్టీ విభక్తిలో 'కిన్ కున్'లే కాకుండా 'యొక్క లోన్ లోపల' కూడా వున్నాయి. అంటే 'నాకున్న సంపద యావత్తూ నీ ప్రసాదమే తప్ప నాదేమీ లేదు ప్రభూ!' అని భావించే భక్తునికి, 'అసలీ దృశ్య ప్రపంచమంతా నేను కల్పించుకున్నది, నాలోనుండే వచ్చింది. ఇది నా భ్రమ తప్ప  దీనికి ఉనికే లేదు' అని తెలుసుకున్న జ్ఞానికి కూడా ఈ చమకం చక్కగా అన్వయిస్తుంది. మరి ఆ నమక చమకాలతో పంచామృతాలు, నవరసాలతో ఆ సదాశివునికి అభిషేకం చేస్తే మన పంచేంద్రియాలూ విషయ విషాల నుండి భగవన్నామామృతం వైపుకి తిరిగి, నవరంధ్రాలతో కూడిన ఈ శరీరం ఆనంద రసమయం అవుతుందనడంలో సందేహమేమున్నది?

వికారి, శార్వరిల సంధికాలంలో ప్రపంచాన్ని కబళించడానికి వస్తున్న కరోనా మహమ్మారి నుండి జనులంతా రక్షింపబడి ప్రపంచమంతా సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలనే మహదాశయంతో శ్రీమాతాజీవారు శ్రీకాళీవనాశ్రమంలో, 'శ్రీసద్గురు విశ్వశాంతి మహాయాగాన్ని' అత్యంత నియమ నిష్ఠలతో 11రోజులు నిర్వహించారు. అందులో భాగంగా, ప్రతిరోజూ పైన చెప్పుకున్న విష్ణు సహస్రనామ పారాయణ, లక్ష్మీ అష్టోత్తర పారాయణ, చండీహోమం, శ్యామలా దండకం, 121 సార్లు రుద్రనమకచమకాలతో శ్రీరామలింగేశ్వర స్వామివారికి పంచామృతాలతో, నవరసాలతో అభిషేకము, గోపూజలు పర్యావరణాన్ని పవిత్రమొనరించడానికై శ్రీ గురుదేవుల పాదుకా ప్రదక్షిణలు, అంతఃకరణ శుద్ధికై ధ్యాన శిబిరం, శివ నారాయణ కవచాలు, వివిధ ఉపనిషత్తులు, ఆదిత్య హృదయం, సుందరకాండ మొదలైన అనేక పారాయణలు అత్యంత  భక్తిశ్రద్ధలతో నిర్వహింప బడ్డాయి.

కాళరాత్రిలా మొదలైన ఈ శార్వరి నిరంతరం విశ్వశాంత్యర్థం, లోకకళ్యాణార్థం శ్రమించే మహాత్ములందరి ఆశీస్సులతో మనందరికీ విశ్రాంతినిచ్చి నూతనోత్సాహాన్ని కలిగించే ప్రశాంత రాత్రిలాగా ముగుస్తుందని ఆశిద్దాం. సర్వేజనాః సుఖినో భవన్తు !!

# భగవంతుని సన్నిధినే ఆశించు

- గాలి జగదీశ్

మానవులు వారి నిత్య జీవితంలో ఎన్నో కోరికలు, ఆశలతో జీవిస్తూ వుంటారు. కొందరు ధనవంతులు కావాలని, కొందరు వస్తువులు, ఆభరణాలు, వస్త్రాలు కావాలని, మరికొందరు ఆరోగ్యంగా వుండాలని, వింత వింత రోగముల నుండి త్వరగా కోలుకోవాలని, కొందరు భార్యా సంతానము కావాలని ఇలా ఎన్నో రకాల కోరికలతో జీవితం గడుపుతూ వుంటారు. అవన్నీ కావాలని భగవంతుణ్ణి కోరతారు కానీ, భగవంతుడి కొరకు ఎవరూ ఆవేదన పడరు. అసలు ఆ భగవంతుణ్ణే వాని సన్నిధియే కావాలని కోరితే అన్నీ ఆయనే సమకూరుస్తాడు కదా.

ఒక రాజ్యంలో ఒక రాజుకు ఆరుగురు భార్యలున్నారు. కొన్ని కారణాల వలన రాజు పరదేశం వెళ్ళ వలసి వచ్చింది. రాజు బయలుదేరే ముందు 'నేను ఆ దేశం నుండి తిరిగి వచ్చేటప్పుడు మీకు ఏం కావాలో కోరుకోండి' అన్నాడు. వెంటనే వారిలో 'మొదటి భార్య తనకు విలువైన బంగారు నగలు కావాలని, రెండవ భార్య తనకు వస్త్రాలు కావాలని, మూడవ భార్య ముఖసౌందర్యానికి కావలసిన సుంగధ ద్రవ్యాలు కావాలని, నాల్గవ భార్య ఇంటి అలంకరణకు కావలసిన వస్తు సామగ్రి కావాలని, ఐదవ భార్య తనకు మంచి రుచికరమైన మిఠాయిలు కావాలని కోరారు. ఆఖరున చిన్న భార్యను కూడ అదేవిధంగా అడిగాడు. ఆమె రాజుపై అమితమైన ప్రేమ కలది. రాజుతో 'మీరు నాకేమీ తీసుకురానవసరం లేదు. మీరు క్షేమంగా, త్వరగా తిరిగి రావడమే నేను కోరుకునేది. మీ ఎడబాటు నాకు చాలా బాధగా వుంటుంది. అందుచేత అతి త్వరలో మీ సాన్నిధ్యాన్నే నేను కోరుకుంటున్నాను' అన్నది.

అనుకున్న ప్రకారం రాజు పరదేశమునకు వెళ్ళి తన పని చూసుకుని, తిరిగి స్వదేశానికి వచ్చేశాడు. తన భార్యలు కోరుకున్న వస్తువులన్నీ ఆయా ప్రకారంగా తెచ్చి, వారి వారి భవనాలకు పంపించివేశాడు. రాజు మాత్రం కేవలం తన సాన్నిధ్యాన్నే కోరుకున్న చిన్న భార్య మందిరానికి వెళ్ళిపోయాడు. చిన్న భార్య మాత్రం ఇతర బహుమానాలు ఏవీ కోరకుండా కేవలం తననే కోరుకున్నదని,

భగవంతుడు తనకు అంత మంచి భార్యను ప్రసాదించాడని ఎంతో సంతోషించాడు. ఆమె కూడా తన భర్తను తన వద్దకు క్షేమంగా చేర్చినందుకు భగవంతునికి కృతజ్ఞతలు తెలుపుకుంది. మిగిలిన భార్యలు వారు కోరుకున్న బహుమతులు పొందగలిగారు కానీ, భర్త ప్రేమను మాత్రం పొందలేక పోయారు.

మానవులు భగవంతుని ద్వారా ప్రపంచంలో లభించే అనిత్యమైన, అశాశ్వతమైన వస్తువులను పొందాలని అభిలషిస్తారు, కానీ భగవంతుని మాత్రం కోరరు. భగవత్ ప్రియులు, పరమ భక్తులు మాత్రము ఈ అశాశ్వతమైన వాటిపై మనస్సు పోనీయక కేవలం భగవంతుని మాత్రమే కోరుకుంటారు. వీరు కేవలం భగవతుని సాన్నిధ్యం మాత్రమే సుఖశాంతులను కలిగిస్తుందని, ఆ ఆనందం ఇతర దేని వలనా కూడా కలగదని గ్రహిస్తారు.

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

**జులై 2020**

1 బుధ - తొలిఏకాదశి - సా॥ 5-30 గం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

5 ఆది- ఆషాఢ పౌర్ణమి (గురు పౌర్ణమి) - ఉ॥11 గం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

15 బుధ - శ్రీగురుదశమి - సా॥ 5-30 గం. సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన

**ఆగస్ట్ 2020**

3 సోమ - రాఖీ - జంధ్యాల పౌర్ణమి - సా॥ 5-30 గం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

11 మంగళ - శ్రీకృష్ణాష్టమి - సా॥ 5-30 గం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

13 గురు - శ్రీగురుదశమి - సా॥ 5-30 గం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

22 శని - వినాయక చవితి - ఉ॥ 11 గం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

# ధ్యానం

సేకరణ- బొంబాయి కృష్ణారావు

'ధ్యానం అంటే ఏమిటి?' ........ ఇది ఒక చిన్న పిల్లవాడిని వేధించిన ప్రశ్న. అయితే, ఆ బాలుడు అర్థం చేసుకోగలిగిన సరళమైన భాషలో వివరించలేక ఆ తల్లిదండ్రులు విచారణలో పడ్డారు.

ఒకసారి ఆ కుటుంబం శ్రీరమణమహర్షి దర్శనార్థం వెళ్ళారు. అప్పుడు ఆ బాలుడు తన ప్రశ్నను ఆ మహర్షిని అడిగాడు. అది విని శ్రీ రమణులు తమలో తాము నవ్వుకున్నారు. వంటవాడిని పిలిచి ఒక దోసె ఆ బాలుడికి తెచ్చి పెట్టమన్నారు. ఒక ఆకు మీద ఆ దోసెను వడ్డించారు. శ్రీరమణులు ఆ బాలుడితో 'ఇప్పుడు హ్మ్! అని చెబుతాను. అప్పుడు నువ్వు ఆ దోసె తినడం ప్రారంభించాలి. మళ్ళీ నేను తిరిగి హ్మ్! అంటాను. అప్పటికి నీ ఆకులో ఆ దోసె ముక్క వుండరాదు' అన్నారు.

ఆ బాలుడు చాలా ఉత్సాహంగా దానికి అంగీకరించాడు. మిగిలిన భక్తులంతా కుతూహలంగా అతనికేసి చూస్తున్నారు. ఇప్పుడు ఆ బాలుడు మహర్షి ముఖం వంకే ఆతృతగా ఆజ్ఞ కోసం ఎదురు చూస్తున్నాడు. ఆయన హ్మ్! అనగానే తినడం ప్రారంభించాడు.

ఇప్పుడు ఆ పిల్లవాడి దృష్టి శ్రీరమణుల మీద వున్నది. అతడు మరల ఆజ్ఞ రాకముందే దోసె పూర్తి చేయాలనుకున్నాడు. బాలుడు ఆతృతగా దోసె పెద్ద ముక్కలుగా చేసి తినడం చేస్తున్నాడు, కానీ, అన్ని సమయాలలో శ్రీరమణుల మీదనే దృష్టి వుంది. దోసె క్రమంగా తగ్గుతోంది. ఇక ఒక చిన్న ముక్క మిగిలి వుంది. బాలుడు రెండవ ఆజ్ఞ కోసం శ్రీరమణుల వంక ఆతృతగా చూస్తున్నాడు. ఆయన ఆజ్ఞాపించిన వెంటనే రెండవ ముక్క నోటిలో పెట్టాడు.

ఇప్పుడు శ్రీ రమణులు ఆ బాలుడిని 'ఇప్పటి వరకు నీ దృష్టి ఎక్కడ వున్నది? నా మీద? లేక దోసె మీద?' అని అడిగారు. 'రెండింటి మీద' అని ఆ బాలుడు బదులిచ్చాడు. శ్రీరమణులు 'అవును. నీవు దృష్టిని నామీద వుంచుతూ, దోసె పూర్తి చేయడంలో నిమగ్నమై వున్నావు. నీవు అస్సలు పరధ్యానం చెందలేదు. ఇలాగే మీరు మీరోజువారీ కార్యకలాపాలు చేస్తూ, మీ దృష్టి మరియు మీ ఆలోచనలూ ఎల్లవేళలా ఆ ఈశ్వరునిపైన వుంచాలి. దీనినే ధ్యానం అంటారు' అన్నారు.

# శ్రీశైల లింగోద్భవ లీల

- కే.శే. సుశీలా ప్రసాద

జగజ్జనని శ్రీ జగదంబిక ఒకసారి కుమారస్వామితో 'కుమారా! శ్రీశైల లింగోద్భవ దివ్యలీలను నీ తండ్రి నుంచి వినే భాగ్యం నాకు కలిగింది. ఇప్పుడు అది నీకు చెప్పబోతున్నాను. శ్రద్ధగా విను' అంటూ దేవి ఇలా చెప్పనారంభించింది ......

'ఎప్పుడో యుగయుగాలనాడు శిలాదుడనే మహాభక్తుడు అనితరసాధ్యమైన మహాతపస్సుచేసి, మహేశ్వరుణ్ణి మెప్పించి, ఇద్దరు పుత్రులను పొందాడు. ఒకడు నందీశ్వరుడు, రెండవవాడు పర్వతుడు.

సరే! నందీశ్వరుడు తపస్సుచేసి, ఈశ్వరుడికి వాహనమై సకలలోక పూజ్యుడయ్యాడు. ఇహ రెండవ వాడైన పర్వతుడు ఈశ్వరుని కొరకై తపస్సు చేస్తూ, బ్రహ్మాండమైన సమాధిలో మునిగిపోయాడు. ఆ తపస్సుకు సకల లోకాలు సంభ్రమాశ్చర్యాలలో మునిగిపోయాయి. ప్రమథులు 'ఇది చిత్రం! చిత్రం!!' అన్నారు. దేవతలు 'ఇది ఆశ్చర్యం! చాలా ఆశ్చర్యం!!' అన్నారు. మునీశ్వరులు 'ఇది ఎప్పుడూ విన్నది కాదు, కన్నది కాదు' అన్నారు. ఇక ఈ అతి ఘోర విఖ్యాత తపస్సుకు గంగాధరుని హృదయంలో ఆనంద వారధులే పొంగి పొరలాయి. పర్వతుని ఎదుట దివ్యమంగళ స్వరూపంలో ప్రత్యక్షమై, 'వత్సా! నీ తపస్సుకు మెచ్చాను. నీకు నా అనుగ్రహం పర్వతుడా! మూడు వరాలు ఇస్తున్నాను కోరుకో!' అన్నాడు.

పర్వతుడు నిలువెల్లా పులకించిపోతూ, ఆ దివ్య చరణ పద్మాలకు పడిపడి మ్రొక్కుతూ .... 'మహేశ్వరా! సదాశివా! భక్తవత్సలా! నా కోసం వచ్చావా!' అంటూ ఆనందంలో తలమునకలైపోతూ మెల్లగా భక్తి మధువును ఒలికిస్తూ ఒక్కొక్క అక్షరమే ఇలా పలికాడు ......

'సదాశివా! నిన్ను నా శిరస్సున మోయాలని ఆకాంక్ష పడుతున్నాను. అందుకుగాను నేను ఇప్పుడే ఇక్కడే పర్వతాకృతిని దాల్చాలి అది నా మొదటి వరం. కైలాసంలో నిన్ను ఆశ్రయించి వున్న విభూతులన్నీ నాపై వచ్చి నిలవాలి ఇది నా రెండవ వరం. నిన్ను దర్శించడానికి వచ్చినవారు ఎంతటి పాపాత్ములైనా సరే, నీ దర్శనమాత్రం చేతనే వారు ముక్తిని పొందాలి. అలా ముక్తినిచ్చే క్షేత్రంగా ఇది విరాజిల్లాలి. ఇది నా ముడవ వరం' అని కోరుకున్నాడు. పరమేశ్వరుడు చిరునవ్వుతో 'నీ

అభీష్టాలు నెరవేరుగాక!' అని దీవించాడు.

ఆ పరమేశ్వరానుగ్రహం చేత ఆ క్షణంలోనే పర్వతుడు, దేవ మానవులు సంభ్రమాశ్చర్యాలతో వీక్షిస్తుండగానే నక్షత్రమండలాన్ని తాకుతూ పర్వతాకృతిని దాల్చాడు. పర్వతుడు నిజంగా పర్వతమైపోయాడు! ఏ పరమేశ్వరుని ఆది, అంతాలను హరి, విరించులు కనుగొనలేక విఫలురై వెనుదిరిగారో, ఆ అనంతుడు, గుణాతీతుడు, శంకరుడు భక్తుని కోరిక మేరకు తన అనంత తత్త్వాన్ని ఉపసంహరించి, పర్వతుని శీర్షంపైన దివ్య ప్రభలను విరజిమ్ముతూ బంగారు లింగంగా నిలిచాడు.

రజతాద్రిపై వున్న సకల తీర్థాలు, నదులు, ఓషధులు, దేవతలు - 'అగణిత పుణ్యాంగుడైన మహేశ్వరుడు ఈ గిరి శిఖరంపైన ఆవిర్భవించినప్పుడు మేమూ ఇక్కడే వుంటాము' అంటూ ఆ గిరిని ఆశ్రయించారు.

రుద్రగణం - 'ఓహో! భూమండలం మీద ఇది ప్రత్యక్ష కైలాసం!' అన్నారు. దేవతలు - 'ఓ పర్వతుడా! నీవు ధన్యుడవు!' అని కీర్తించారు. బ్రహ్మ, విష్ణువులు - 'ఈశ్వరుని ఇక్కడ దర్శించ గలుగుతున్నాము' అని పొంగిపోయారు. రాక్షసులు - 'మా ఈశ్వరుడు ఇక్కడే వుంటే, మేమూ ఇక్కడే వుంటాము' అన్నారు.

ఆదిశక్తి పార్వతీదేవి కుమారస్వామికి ఈ పర్వతుని కథ చెబుతూ, అతనిని కీర్తిస్తూ ఇంకా ఇలా అన్నది...... 'వత్సా! ఇంతకుముందు జగద్రక్షకుడైన సదాశివుని కరుణతో ఎందరెందరో ఎన్నెన్నో వరాలను పొందారు. వారంతా ఒక ఎత్తు. ఈ పర్వతుడు ఒకడూ ఒక ఎత్తు. ఈ పర్వతుడు తన స్వలాభం కోసం కాక, లోక కళ్యాణానికై వరాలను కోరుకున్నాడు. పర్వతుని వరం చేతనే శ్రీగిరి క్షేత్రం దర్శనం చేతనే మోక్షాన్ని అనుగ్రహించే క్షేత్రమయింది. విష్ణుమూర్తి ఈశ్వరానుగ్రహంతో సుదర్శన లాభాన్ని పొందాడు. పరశురాముడు పరశువును, రావణుడు చంద్రహాసాన్ని, పార్థుడు పాశుపతాన్ని పొందారు.

కుమారా! శిలాదుని పుత్రుడైన పర్వతుడు సద్భక్తితో మహేశ్వరునికి సింహాసనమయ్యాడు. ఇటువంటి బిడ్డలను కన్న శిలాదుడు ధన్యుడు! సుమా!' అంటూ శ్రీశైల లింగోద్భవ మహాలీల ముగించింది..... జగదంబిక!

# కైవల్యోపనిషత్

- రేఖ

(గత సంచిక తరువాయి)

మనస్సుకి స్వయం సత్తా లేదు. అది జడమే. దానికి ఆధారం ఆత్మయే. ఆ పరమాత్మయే అవిద్య ద్వారా ప్రవర్తించినప్పుడు జీవుడు అవుతున్నాడు. ఇంద్రియాలు వాటి పని అవి చేస్తున్నాయి, విషయ ప్రపంచంలో జీవుడు వివిధ భోగాలు అనుభవిస్తున్నాడు అంటే ఆ ఆత్మశక్తి వల్లనే ఏ కార్యమైనా చేయగలుగుతున్నాడు, అనుభవించ గలుగుతున్నాడు. ఈ విధంగా జాగ్రదావస్థలో మన ప్రతి ఒక్కరిలో ప్రవర్తించే జాగృతుణ్ణి ఈశ్వరుడు అంటారు.

అసలు సత్యాన్ని గుర్తించక తెలుసుకోలేక మానవుడు నేను చేస్తున్నాను, నేను కాబట్టి చేశాను, నా వల్ల కాబట్టి ఫలానా పని జరిగింది అని చెప్పుకుంటూ, స్వయం సత్తా అనుకుంటూ కర్మలు చేస్తూ వుంటాడు. ఆ కర్మలే జన్మలకు కారణమవుతాయి. ఇంతకు ముందు చేసిన కర్మల సమూహాన్ని సంచితం అంటారు. అవి ప్రస్తుత జన్మలో ప్రారబ్ధ కర్మ అనుభవించేటట్లు చేస్తాయి. ఈ విధంగా దేహ భావనతో కర్మలు చేస్తూ, ఆ పరమాత్మ శక్తి వలనే ఏ పనైనా జరుగుతోంది అన్న యదార్థాన్ని గుర్తించక చేస్తూవుంటే, భవిష్యత్తులో ఇంకో జన్మకు కావలసిన కర్మలను పోగుచేసుకుంటాడు. వాటిని ఆగామి కర్మలు అంటారు.

మనలను ఉద్ధరించడానికి వచ్చిన మహాత్ములు అవతారానికి వచ్చినవారు. **'ప్రారబ్ధాయ సమర్పితం స్వవపుః'** అన్నట్లుగా, ఈ శరీరం వచ్చినది. అనుభవించడానికేగా వచ్చింది, పోతుంది. లోపల వున్నది బాగానే వున్నదికదా అని, సాక్షిగా చూస్తున్నామా? లేక మీద వేసుకుని దుఃఖపడిపోతున్నామా? దుఃఖపడిపోతుంటే ఆత్మజ్ఞానం రానట్లే. సుఖం గాని, దుఃఖం గాని సాక్షిగా చూడగలగడం గొప్ప తపస్సే. ఈ సాక్షిత్వ భావన మనకి విచారణ ద్వారా మాత్రమే వస్తుంది.

13వ మంత్రంలో స్వప్నావస్థ గురించి చెబుతున్నాడు బ్రహ్మదేవుడు. 12వ మంత్రంలో జాగ్రదావస్థ గురించి తెలిపారు. మనకు వున్న స్థితిగతుల గురించి విచారణ చేయడానికి ఈ మంత్రాలు ఎంతో ఉపకరిస్తాయి. ఈ మంత్రంలో జీవుడు స్వప్నమందు తన మాయతో కల్పించుకున్న జీవలోకంలో సుఖదుఃఖాలను అనుభవిస్తున్నాడు. సుషుప్తి

అవస్థలో సర్వమూ విలీనమైనప్పుడు తమస్సు చేత ఆవరింపబడి సుఖరూపంలో వుంటున్నాడు - అని పరమేష్ఠి అశ్వలాయన మహర్షికి తెలిపారు. జాగ్రదావస్థలో స్థూలదేహంతో 'విశ్వుడి'గా ఆ పరమాత్మ ఆధారంగా వున్న ఈ జీవుడు ఈ ప్రపంచంలో అవిద్యతో కూడి, బాహ్య దృష్టితో వ్యవహరిస్తాడు. వివిధ భోగాలను అనుభవిస్తాడు.

స్వప్నావస్థలోకి వచ్చేసరికి ఆ పరమాత్మ మనోబుద్ధి రూపమైన సూక్ష్మ శరీరం ద్వారా అనుభవాలను పొందేటప్పుడు, స్వప్న ద్రష్టగా, సాక్షిగా అవుతున్నాడు. అప్పుడు 'తైజసుడు' అని పిలువబడుతున్నాడు. ఈ తైజసుడు తన స్వంత ఆలోచనలతో సూక్ష్మ శరీరంలో వ్యవహరిస్తూ వుంటాడు. స్వప్నంలో ఒక స్వప్న ప్రపంచాన్ని సృష్టించుకుంటాడు. ఆత్మను గురించిన జ్ఞానం లేకపోవడం వలన తప్పుడు విషయాలతో కూడిన ఒక మాయా ప్రపంచాన్ని సృష్టించుకుంటాడు. ఎలా అంటే ఒక కలలో సుఖాన్ని అనుభవిస్తున్నట్లు, ఆనందభాష్పాలు జాలువారుతున్నట్లు చూస్తాడు. మెలకువ రాగానే ఆనంద భాష్పాల యొక్క గురుతులు కూడా వుంటాయి. అలాగే దుఃఖాన్ని కలిగించే భయంకరమైన కల ఏదైనా వస్తే, కన్నీరు కార్చడం, శరీరం భయంతో వణకడం వంటివి కలలో అనుభవిస్తాడు. మెలకువ వచ్చాక నిజంగా తాను ఆ దుఃఖపడిన లక్షణాలు కనిపిస్తాయి. ఈ స్వప్న ప్రపంచంలో వున్నంత సేపూ, సత్యం మరుగుపరచి, అసత్యమైన ఊహలను కల్పించి, తాత్కాలికంగా సత్యమన్నట్లు భ్రమింపజేసే శక్తి ఈ మాయాశక్తి.

సుషుప్తి అవస్థలో స్వప్నం వుండదు. గాఢ నిద్రలో వున్న పరమాత్మను 'ప్రాజ్ఞుడు' అంటారు. ఈ సుషుప్తి అవస్థ కారణ శరీరం ద్వారా వ్యక్తమవుతుంది. వాసనల సమూహమే కారణ శరీరం. కారణశరీరంలో వుండటమంటే కారణావస్థలో వుండటమన్నమాట. ఉదాహరణకు వటబీజం. ఒక పెద్ద వృక్షం ఆ బీజంలో అవ్యక్తమై కారణావస్థలో వున్నది. అనుకూలమైన పరిస్థితులు ఏర్పడినప్పుడు, అంటే సరియైన క్షేత్రంలో బీజం పాతిపెట్టి, నీరుపోసి, కలుపు మొక్కలు లేకుండా చూసుకుంటుంటే, అవి పెరిగి పెద్ద మొక్కగా, తరువాత పెద్ద చెట్టు అవుతుంది.

- సశేషం

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమంలో కార్యక్రమాలు

**జులై 2020**

1 బుధ - తొలిఏకాదశి - శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన, ఏకాహం సంకీర్తన.

5 ఆది - ఆషాఢ పౌర్ణమి (గురు పౌర్ణమి) - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

15 బుధ - శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

16 గురు - దక్షిణాయనం ప్రారంభం.

18 శని - శనిత్రయోదశి

19 ఆది - మాస శివరాత్రి

20 సోమ - అమావాస్య

23 గురు - శ్రావణ శుద్ధ తదియ - సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ.

31 శుక్ర - వరలక్ష్మీ వ్రతం

**ఆగస్ట్ 2020**

1 శని - శనిత్రయోదశి

3 సోమ - రాఖీ - జంధ్యాల పౌర్ణమి - శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన.

11 మంగళ - శ్రీకృష్ణాష్టమి - కలశస్థాపన, రాధాకృష్ణ సహస్రనామార్చన, భక్తసమారాధన. రాత్రి 7గం. శ్రీసద్గురుపాదపూజ.

12 బుధ - ఉదయం 11గం. సామూహిక రాధాకృష్ణ సహస్రనామార్చన, భక్తసమారాధన.

13 గురు - శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన, ఏకాహం సంకీర్తన.

14 శుక్ర నుండి 23-9-20 బుధ వరకు శ్రీరామానుజదాసుగారిచే శ్రీ సంపూర్ణ రామాయణ ప్రవచనం

17 సోమ - మాసశివరాత్రి

19 బుధ - అమావాస్య

22 శని - వినాయక చవితి - తె.జా 5-30ని॥ శ్రీసద్గురుపాదపూజ, ఉదయం 11గం. సామూహిక గణపతిపూజలు, భక్తసమారాధన.

# అగస్త్యుడు

(గత సంచిక తరువాయి) - రమణ ప్రసాద్

దేవతలు,"మునినాథా! ఈ సాగరము అనేక జంతువులకు ఆశ్రయమిస్తున్నది. కాబట్టి తిరిగి పూరింపుమ"ని వేడుకున్నారు. అగస్త్యుడు, "దేవతలారా! ఈ సముద్ర జలం నాలో జీర్ణమైపోయింది. నేను మూత్ర ద్వారము నుండి పూరిస్తాన"ని చెప్పి పూరించాడు. ఆ కారణంచేత ఆ రోజు నుండి సముద్ర జలం ఉప్పగా మారింది.

అగస్త్యుడు దండకారణ్యంలో ఒక ఆశ్రమం నిర్మించుకుని తపస్సు చేసుకుంటున్న సమయంలో శ్రీరాముడు అరణ్యవాసం చేస్తూ, సీతా లక్ష్మణ సమేతంగా అగస్త్యముని వద్దకు వచ్చాడు. అగస్త్యుడు వారిని ఆదరించి అతిథి సత్కారాలను చేసి శ్రీరామునికి ఒక దివ్య ఖడ్గము, వైష్ణవమయమైన విల్లు, అమోఘ బాణములు కల అమ్ములపొదిని ఇచ్చి, "మీరు గౌతమీ నదీ తీరాన ఉన్న పంచవటిలో ఆశ్రమం నిర్మించుకొని అక్కడ నివాసం చేయండి" అని చెప్పగా వారు అగస్త్యుని వద్ద సెలవు తీసుకొని వెళ్ళిపోయారు.

తరువాత కొంత కాలానికి శ్రీరామ రావణుల యుద్ధంలో శ్రీరాముడు రావణుని తీవ్రబాణాలచే బాధింపబడి భావి కర్తవ్యము తోచక విచారిస్తున్న సమయంలో అగస్త్యుడు అక్కడికి వచ్చాడు. శ్రీరామునికి జయప్రదమైనది, అఖిలైశ్వర్య మంగళకరమైన "ఆదిత్య హృదయము" అనే మహాస్త్రాన్ని ఉపదేశించి, శ్రీరాముని ఉత్సాహపరిచి, "ఈ ఆదిత్య హృదయ స్తవ ప్రభావం వలన నువ్వు రావణుని వధించటం నిశ్చయము. విజయం నిన్నే వరిస్తుంది" అని దీవించి వెళ్ళిపోయాడు.

అగస్త్యుడు తారక బ్రహ్మోపదేశము కొరకు అవిముక్త క్షేత్రంలో విశ్వేశ్వరుని సేవిస్తున్న సమయంలో, వింధ్య పర్వతము, మేరు పర్వతముపై అసూయతో పెద్దగా పెరిగి సూర్య చంద్ర నక్షత్రముల గమనానికి అవరోధం కలిగించటంతో రాత్రింబవళ్ళు ఏర్పడక లోక వ్యవహారములు ఆగిపోయాయి. దేవతలు ఎంత ప్రార్థించినా వింధ్యకు కోపం ఉపశమించ లేదు. అప్పుడు దేవతలు బ్రహ్మతో మొర పెట్టుకోగా, బ్రహ్మ వారిని అగస్త్యుని వద్దకు పంపాడు. వారు భూలోకంలో ఉన్న కాశీ పట్టణానికి వచ్చి అగస్త్యుని సందర్శించి వారు వచ్చిన కారణం తెలిపారు. అగస్త్యుడు, "నేను దేవతల

కార్య నిమిత్తంగా కాశీ విడువవలసి వస్తోంద”ని విచారించి లోపాముద్రా సహితుడై వింధ్య పర్వత ప్రాంతాన్ని సమీపించాడు. అగస్త్యుని దూరం నుంచి చూసి విధ్య పర్వతం గౌరవ సూచకంగా క్రిందికి ఒదిగిపోయింది. లోకోపద్రవం తొలగిపోయింది. వింధ్య పర్వతం అగస్త్య మహర్షికి సాష్టాంగం చేసి, “మహానుభావా! ఈ భృత్యుడేమి చేయవలెనో ఆజ్ఞాపించండి” అని వేడుకొన్నాడు. “పర్వతరాజా! నేను సతీ సమేతంగా దక్షిణాపథానికి తీర్థయాత్ర చేయటానికి వెళ్తున్నాను. మేము తిరిగి వచ్చేదాకా భూమికి సమానంగా ఉండమ”ని ఆదేశించాడు.

అగస్త్యుడు తీర్థయాత్రలు చేస్తూ ఆంధ్రదేశానికి వచ్చి ద్రాక్షారామం చేరి భీమేశ్వరుని దర్శించి అక్కడ కొంత కాలము ఉండి కొల్లాపురము చేరాడు. అక్కడ లక్ష్మీదేవిని స్తుతించి ఆమెను ప్రసన్నురాలిగా చేసికొన్నాడు. లక్ష్మీదేవి ప్రత్యక్షమై, “ఋషి పుంగవా! నీ స్తుతికి సంతసించాను. నీవు రాగల యిరవైతొమ్మిదవ ద్వాపరంలో వ్యాసుడివై వారణాసిలో వేద శాస్త్ర పురాణ సంహిత, ధర్మ శాస్త్రాలను రచిస్తావు” అని దీవించింది.

పూర్వం హిమగిరిపైన పార్వతీ పరమేశ్వరుల వివాహం జరుగుతుండగా, ఆ కళ్యాణానికి వచ్చిన యక్ష కిన్నెర కింపురుషాదులు బ్రహ్మానందంలో ఓలలాడుతుండగా, ఆ భారానికి భూమి దక్షిణ దిక్కుకు పైకి లేవడంతో ఉత్తరదిక్కు క్రుంగి పోవడం మొదలుపెట్టింది. అప్పుడు పరమేశ్వరుడు అగస్త్యుని పిలిచి, “కుంభ సంభవా! ఈ ఉపద్రవంనుండి కాపాడగల సమర్థుడవు నీవే” అని చెప్పాడు. అగస్త్యుడు శిష్య సమేతంగా దక్షిణదిక్కువైపుగా వెళ్ళాడు. అప్పుడు భూమి సమానం అయింది. అగస్త్యుడు ఆ విధంగా చేసి భూభారాన్ని తగ్గించాడు. అగస్త్యమహర్షి లోకోత్తర పురుషుడై జీవితాంతం లోకోద్ధరణ కార్యాలను చేసిన విశ్వ శ్రేయస్కరుడు. మహా భారతంలో శాంతిపర్వంలో ఈయన చేసిన మహాబోధ “అగస్త్య గీత” అనే పేరుతో ప్రసిద్ధి పొందింది.

ఆయన ఉపదేశించిన తత్త్వసారము -

**“శివుడే దాత శివుండె భోక్త। శివుఁడే చేయును మఖాదిక్రియల్। శివుఁడే విశ్వము నే శివుండ”**

అని అద్భుతాద్వైతానుసంధానాన్ని చేశాడు. అగస్త్య మహర్షి నేటికీ భాద్రపద మాసంలో నక్షత్ర రూపంలో అందరికీ దర్శనం ఇస్తున్నాడు.

# ఆచార్య మహాప్రజ్ఞ

సేకరణ - మురళి

జైన్ శ్వేతాంబర తేరాపంత్ 10వ గురువు ఆచార్య మహాప్రజ్ఞ స్వామి 1920 జూన్ 14వ తేదీన రాజస్థాన్‌లోని ఝున్ ఝున్ జిల్లా, తామ్కోర్ అనే గ్రామంలో జన్మించారు. జన్మ నామం నాథ్మల్. కేవలం రెండున్నర మాసముల వయస్సులోనే తండ్రిని కోల్పోవటంతో, తల్లి బాలూజీ సంరక్షణలో పెరిగారు. ఉమ్మడి కుటుంబం కావటంతో ఇంట్లోని వారందరూ తండ్రిలేని నాథ్మల్‌ను ఎంతో ప్రేమతో పెంచారు. ఆ గ్రామంలో పాఠశాల లేకపోవడంతో కేవలం అక్షరాలు, గణితము మాత్రమే నేర్చుకున్నారు. తల్లి ఆధ్యాత్మిక చింతనగల వ్యక్తి కావడంతో ఖాళీ సమయంలో పురాణ ఇతిహాసాల గురించి, భక్తుల గురించి తెలియజేయడం వలన ఆ బాలునిపై బాగా ముద్ర పడింది. జైన్ సన్యాసుల ప్రవచనాలు తరచు వినడం వలన తాను కూడా సన్యాసి కావాలని నిశ్చయించుకున్నారు. తల్లి అనుమతితో 29-1-1931లో 10 ఏళ్ళ వయస్సులోనే సన్యాసం స్వీకరించడంతో ముని నాథ్మల్‌గా పిలువబడ్డారు. హిందీ, సంస్కృతం, ప్రాకృతి, రాజస్థానీ భాషలను బాగా అభ్యసించి పాండిత్యం పొందారు.

ఆచార్య తులసి ఆధ్వర్యంలో 2-3-1949న ప్రారంభించబడిన అనువ్రత ఉద్యమంలో ముని నాథ్మల్ ప్రధానపాత్ర పోషించారు. సమాజంలో స్వీయ పరివర్తన తీసుకునివచ్చి, ప్రజల జీవితాలలో స్వచ్ఛత, సచ్ఛీలత, స్వీయ క్రమశిక్షణ ఏర్పడాలనేది ఈ ఉద్యమ ప్రధాన ఉద్దేశం. ఈ ఉద్యమం ప్రపంచ వ్యాప్తంగా అనుసరింపజేయడానికి ముని నాథ్మల్ ఎంతో కృషి చేశారు. జైనమతానికి సంబంధించిన గ్రంథాలు చాలా వరకు ప్రాకృత, సంస్కృత భాషలలో వుండిపోవడం వలన ప్రజలకు అందుబాటులో లేవని, వాటిని హిందీలోకి తర్జుమా చేసి, 1955లో ముద్రించడానికి ముని నాథ్మల్ అందించిన వ్యాఖ్యానం అద్భుతం!

సుమారు 30 సం॥ల వయస్సులో ధ్యాన ప్రక్రియలో అనుభవించిన ఆనందాన్ని సుమారు 20 సం॥లు కొనసాగించి, ఆచార్య తులసి స్వామివారి అనుభవాన్ని తోడుచేసుకుని, 'ప్రేక్ష ధ్యానము' అనే నూతన ప్రక్రియను వ్యవస్థీకృత మరియు శాస్త్రీయ విధానంలో ప్రారంభించారు. ఆ విధానంలో ప్రధాన విభాగములు ధ్యానము, యోగాభ్యాసము, ప్రాణాయామము, మంత్రోపాసన. ఈ విధానమును ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించడానికి కావలసిన కేంద్రములు

స్థాపించబడ్డాయి. విసుగు విరామం లేని సేవలకు అత్యంత ప్రీతిపాత్రులై ఆచార్య తులసి స్వామి ముని నాధ్మల్‌ను తమ వారసునిగా ప్రకటించి, 4-2-1979న 'ఆచార్య మహాప్రజ్ఞ'గా నామకరణం చేశారు. అప్పటి నుండి స్వామి మహాప్రజ్ఞ బాధ్యతలు మరింతగా పెరిగాయి. అనువ్రత ఉద్యమమం, ప్రేక్ష ధ్యానము, జీవన్ విజ్ఞాన్ కార్యక్రమాలను ముందుకు తీసుకువెళ్లడం తమ ప్రధాన ధ్యేయంగా భావించి, కార్యాచరణ తీవ్రతరం చేయడానికి వికాస్ పరిషత్ అనే ఉపసంఘాన్ని ఏర్పాటు చేశారు.

1991లో జైన్ విశ్వభారతి విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయడంలో కీలకపాత్ర వహించిన ఆచార్య మహాప్రజ్ఞ 1965 నుండి దాని అధ్యక్షులుగా వ్యవహరించారు. ఈ విశ్వవిద్యాలయం ప్రధాన ఉద్దేశం సంస్కృత, ప్రాకృతి భాషల ఉద్ధరణ, ప్రజలలో స్వచ్ఛత, సచ్ఛీలత, అహింస, శాంతి, యోగ, ధ్యానము, సాహిత్యము పెంపొందించడం, జైన్ సిద్ధాంతాల ప్రచారం.

2001-2009సం॥ల మధ్య అహింసా పాదయాత్ర నిర్వహించి, ఉత్తర భారతదేశంలో 87 జిల్లాలలో పర్యటించి సుమారు 2400 గ్రామాలు, నగరాలు, పట్టణాలలో సభలను నిర్వహించి, ప్రజానీకానికి అహింసా మార్గాన్ని, స్వచ్ఛత, సచ్ఛీలతలను ఉద్బోధించారు. దుర్వ్యసనాలకు, మత్తుపదార్థాలకు బానిసలు కాకూడదని యువకులకు బోధించారు.

ఆచార్య మహాప్రజ్ఞకు ధ్యానం చేయడం చాలా ఇష్టం. సన్యాసం స్వీకరించినప్పడి నుండి గంటల కొలదీ ధ్యానం చేసేవారు. అందులో అమితమైన ఆనందాన్ని పొందేవారు. సర్వకాల సర్వావస్థలయందు ఏ పనిలో వున్నా ధ్యానము చేస్తూనే వుండేవారు. ధ్యానంలో వారు పొందిన దివ్యానుభూతుల వలననే 'ప్రేక్ష ధ్యానము' అనే ప్రక్రియను స్థాపించి, ప్రచారం చేయడం జరిగింది. దీనితోపాటు ప్రాణాయామం, యోగాభ్యాసం, మంత్రోపాసన నియమం తప్పకుండా చేసేవారు. ప్రగాఢమైన మంత్రోపాసన వలన మానవులలో నిక్షిప్తమైవున్న నిగూఢ శక్తులు ప్రకటితమవుతాయి అని నిర్వచించారు. ప్రతిరోజూ సాయంత్రం మూడు గంటలు మౌనం పాటించేవారు.

తమ 22వ ఏటనే రచనా వ్యాసంగం మొదలుపెట్టి సుమారు 300 పుస్తకములు రచించారు. ఆచార్య మహాప్రజ్ఞ తమ 90వ ఏట, తాము సన్యాసం స్వీకరించిన చోటనే 9-5-2010న మహాప్రస్థానం చేరారు.

# సమర్థ సద్గురు నాథుని దివ్య చరిత్ర

## శ్రీహరిరావు గారితో శ్రీబాబు

- కీ.శే. విజయేశ్వరానంద ప్రసాద్

శ్రీబాబు శ్రీహరిగారింటికి వచ్చిన సందర్భాలలోను, యితర పండుగలలోను, పూజలలోను, యాత్రలలోను, సమావేశాలలోను శ్రీబాబు లీలలతో మాటలతో బోధలతో కూడిన సన్నివేశాలను, భక్తురాలైన శ్రీహరిగారి కుమార్తె చి॥సౌ॥ సుశీల పదేళ్ళపాటు శ్రద్ధగా దినచర్యగా (డైరీ) వ్రాసింది. అందులోని ప్రముఖమైన విషయాలను యిక్కడ పొందు పరుస్తున్నాను.



24-9-1957 : ఈ రోజు నుంచి పోతునూరులో దసరా పూజలు ప్రారంభమైనాయి. ఒక రోజు ఉపన్యాసంలో శ్రీ బాబు సీత, సావిత్రి మొదలైన మహా పతివ్రతలను గురించి చెప్పి, భారతి, రాధ వాళ్ళతో "కన్యలందరు అలాంటి పతివ్రతల చరిత్రలు చదివి అలాగ ఉండాలి" అన్నారు.

22-11-1957 : "అనంతపురంలో ఒకావిడ చాలా దీక్షతో నన్ను గురించి ధ్యానం చేస్తూ కూర్చున్నది. ఆమెకు దర్శన మివ్వక తప్పలేదు" అని శ్రీ బాబు భీమవరంలో శ్రీహరిగారితో చెప్పారు.

23-11-1957 : శ్రీహరిగారికి, బందా తాతయ్యగారికి, సుబ్బారావుగారికి శ్రీ బాబు తమతో భోజనం పెట్టించారు. ఒక్కొక్కళ్ళకి తవ్వెడు బియ్యపు అన్నం పెట్టించి కబుర్లతో తినిపిస్తూ, మధ్యలో "అమ్మ చాలా దయామయి. తన పిల్లల్ని ఎత్తుకుని 'చందమామ రావే...' అని లాలిస్తూ గోరుముద్దలు తినిపిస్తుంది. ఎవళ్ళని చూడదలచుకుంటే వాళ్ళని తానే తెచ్చుకుంటుంది" అన్నారు.

6-12-1957 : ఈ రోజు నుంచి ఆరు రోజులు పోతునూరు లోను, తరువాత మూడు రోజులు గుండుగొలనులో కృష్ణమూర్తి రాజు గారింట్లోను శ్రీ బాబు ఉన్నారు. చలపతి, బందా తాతయ్య, శ్రీహరిగారలతో కూర్చుని శ్రీ బాబు సహపంక్తి భోజనం చేశారు. ఒక

రోజు రాత్రి శ్రీ బాబు "రాత్రి 2-30 ని॥లకి రండి బాబూ! అట్ల తద్ది భోజనాలు, చద్దన్నాలు తిందాము"అన్నారు. మాటలే గాక, పాటలు కూడా పాడుతూ, చక్కని ఉపన్యాసం చెప్పారు. మధ్య మధ్యలో ఆపి జగన్మాత ఏదో చెబుతుంటే వింటునట్లు "ఊఁ, ఊఁ" అనేవారు.

9-8-1958 : కవిగారి కుమారుడు సుందరామయ్యగారింటికి 'అమ్మ'తో (దేవతార్చన) సహా శ్రీ బాబు వచ్చారు. "పల్నాటి సీమకు వెళ్ళాలి. చాలా పనులున్నాయి" అన్నారు. "కష్టాలు ఓపికగా సహిస్తే, తరువాత సుఖాలూ తప్పక వస్తాయి. కష్ట సుఖాలు రెండిటిలోనూ అమ్మ ఎప్పుడూ రక్షిస్తూ ఉంటుంది" అన్నారు. సుబ్బారావుగారిచేత "గుహుడా! నీవెంత ధన్యుడవో!" అని పాడించి, తామూ రాగాలాపన చేస్తూ పాడి అర్థం చెప్పారు.

7-9-1958 : గుండుగొలనులో నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న మండపం మీద కాసేపు కూర్చున్నారు. తరువాత స్వాములవారి సమాధి చూసి వచ్చారు. "బందరులో అన్నపూర్ణమ్మగారని మహాభక్తురాలుంది. వారింటికి వెళ్ళి మూడు రోజులు జగన్మాత పూజలు జరిపి తీర్థప్రసాదమిచ్చాను. ఒకప్పుడు ఆ బందరులోనే నాకు అన్నం నీళ్ళు దొరకనివ్వక, నా మీద రాళ్ళు రువ్వారు. ఏ అరుగు మీద పడుకున్నా నన్ను వదిలే వారు కాదు. నన్ను ఎరగని వాడు ఆ ఊళ్ళో ఒక్కడూ లేడు. కాని బందరు చాలా బాగుంది. మచిలీ పట్నం మంచి పట్నం. అక్కడ నా పేర ఒక ఆశ్రమం కొనేస్తే బావుంటుంది" అన్నారు.

22-9-1958 : ఏలూరులో శ్రీహరిగారింటికి వచ్చి కూర్చుని, యింటివారి ఆరేళ్ళపాపతో ఆరేళ్ళబాబు లాగా అయిపోయి మాట్లాడారు శ్రీ బాబు. "మా అమ్మ ఎంతో మంచిది. అందుకని నేను కూడా ఎంతో మంచివాణ్ణి అయిపోయాను. మా అమ్మ నాకు నగలన్నీ చేయించింది. ఇదిగో "ప్రసాద బాబు" అని పేరున్న నా ఉంగరం. ఇదిగో "శ్రీరామ" అని వ్రాసిన రాళ్ళ గొలుసు" అని ఆ పాపకు చూపించారు. శ్రీహరిగారితో "భక్త ప్రియుణ్ణి గనుక ఎవరో భక్తులు 'ఇది మీరు ధరించక తప్పదు' అని యిస్తే, యీ పతకం వేసుకున్నాను. నా యిల్లు మనుష్యుల హృదయాలలోనే ఉంది" అన్నారు.

-సశేషం

విష్ణు  కథలు

# శ్రీరామానుజులు

-రమణ ప్రసాద్

శ్రీరంగంలో ఆళ్వందారుకు అంత్యకాలం సమీపించింది. రామానుజుణ్ణి పీఠంపై అభిషిక్తుణ్ణి చేయాలని నిర్ణయించుకుని శ్రీరామానుజుణ్ణి తీసుకొని రమ్మని పెరియనంబిని పంపారు. ఆయన,



రామానుజుడు వరదరాజస్వామి సన్నిధిలో ఉండటం చూసి భక్తి పారవశ్యంతో వరదరాజస్వామిని ఎలుగెత్తి స్తుతించాడు. ఆ భక్తికి, కవిత్వానికి ప్రభావితుడైన శ్రీరామానుజుడు "ఈ కీర్తనను రచించింది ఎవరు? అని ప్రశ్నించాడు.

"ఆళ్వందార్" అని చెప్పాడు, పెరియనంబి. "ఆ మహానుభావుణ్ణి నేను చూడగలనా?" అని అడిగాడు శ్రీరామానుజుడు. "నేను ఇప్పుడే మిమ్మల్ని ఆళ్వందార్ దగ్గరకు తీసుకు వెళతాను" అన్నాడు పెరియనంబి. శ్రీరామనుజుడు, పెరియనంబి వరదరాజస్వామి అనుమతితో శ్రీరంగం బయలుదేరారు. అప్పటికే ఆలశ్యం అయింది. ఆళ్వందార్ అస్తమించారు. ఆయన అంత్యక్రియలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

శ్రీరామానుజుడు మహాదేశికుడైన అళ్వందార్ పాంచభౌతిక కాయాన్ని దర్శించటానికి దగ్గరగా వెళ్ళారు. ఆశ్చర్యం! కుడిచేతి మూడు వేళ్ళు ముడుచుకుని ఉన్నాయి.

అక్కడ గుమికూడిన శిష్యులు ఇలా చెప్పారు. "అళ్యందార్‌కు మూడు తీరని కోరికలు ఉన్నాయి. అందువలననే మూడు వేళ్ళు ముడుచుకుని వున్నాయి" అని ఆ కోరికలు ఏవంటే–

మొదటిది: బ్రహ్మసూత్రాలకు సరళమైన వ్యాఖ్య వ్రాయటం;

రెండవది: విష్ణుపురాణాన్ని రచించిన పరాశరుని పేరుని వెలుగులోకి తేవటం;

మూడవది: శఠగోపమహాత్ముడు రచించిన తిరువైమోజీని వెలుగులోకి తీసుకురావటం.

శ్రీరామానుజులవారు, "ఈ కోర్కెలను నేను తీరుస్తాను అని వాగ్దానం చేస్తున్నాను" అన్నారు. అంతే! ఆ మూడువేళ్ళూ తెరుచుకున్నాయి.

ఆళ్వందార్ వారి అంత్యక్రియలు పూర్తి కాగానే శ్రీరామానుజులు కంచికి తిరిగి వచ్చి తన పూజా కార్యక్రమాలలో మునిగిపోయారు: శ్రీవరదరాజ స్వామి తనను ఏమి ఆదేశించదలుచుకున్నారో తెలుసుకోవాలని తన ఆవేదనను తిరికచ్చినంబికి నివేదించారు.

భగవద్వాణి వినపడింది -- "నేనే చరమ సత్యాన్ని. పరిపూర్ణ శరణాగతి ముక్తికి మూలమైన బాట. వ్యక్తిగత ప్రయత్నాలు నిష్ఫలం. నా అనుగ్రహంతో ముక్తి లభిస్తుంది. ఇప్పుడు జీవించి ఉన్నవాళ్ళలో పెరియనంబి ఉత్తముడు".

ప్రభువు ఆజ్ఞను అనుసరించి పెరియనంబి వద్ద దీక్ష తీసుకోవాలని శ్రీరంగానికి శ్రీరామానుజులు ప్రయాణమయ్యారు. శ్రీరామానుజుడిని కలవటానికి పెరియనంబి కంచికి ప్రయాణమైనాడు ఇద్దరూ మధురాంతకంలో కలుసుకున్నారు.

శ్రీరామానుజుని ప్రార్థన మీద పెరియనంబి వైష్ణవ సిద్ధాంత రహస్యనిధులను విశదపరచి దీక్ష ఇచ్చాడు. ఇది మధురాంతకంలోని శ్రీరామాలయంలోజరిగింది. ఆ తరువాత ఇద్దరూ కంచికి వచ్చారు.

-సశేషం

---

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - PALURI SIVA RAMA KALI PRASAD